# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

TELTEL/2023/88710

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | సోమవారం - 10- ఆగస్టు 2026 | సంపుటి : 4 | సంచిక : 67 | పేజీలు - 8 | వెల : రూ 7 | www.telanganamuchatlu.in


# అమరవీరుల కుటుంబాలకు టీజీ-వీర్ అండ




## పోలీసింగ్‌లో కొత్త సవాళ్లు

### డీజీపీ సి.వి. ఆనంద్

- వరంగల్‌లో పోలీసింగ్ సమీక్ష
- సైబర్ నేరాలపై అప్రమత్తం
- డ్రగ్స్ నిర్మూలనకు కఠిన చర్యలు
- మౌలిక పోలీసింగ్‌కే ప్రాధాన్యం

**వరంగల్, ఆగస్టు 9 (తెలంగాణ ముచ్చట్లు):** ఒకప్పుడు నక్సలిజం పోలీసింగ్‌లో అతిపెద్ద సవాలుగా ఉండేదని, ప్రస్తుతం సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలు, ఆర్థిక నేరాలు, రోడ్డు భద్రత వంటి అంశాలు ప్రధాన సవాళ్లుగా మారాయని రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ పేర్కొన్నారు. ఆదివారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ పనితీరును సమీక్షించిన ఆయన, సాంకేతికత ఎంత అభివృద్ధి చెందినా మౌలిక పోలీసింగ్‌ను విస్మరించరాదని అధికారులకు సూచించారు. ఎన్ఐటీలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, టీ-స్పార్క్, సీఐడీ అధికారులు సైబర్ నేరాల ధోరణులు, దర్యాప్తు విధానాలు, నూతన సాంకేతిక వ్యవస్థలపై ప్రజెంటేషన్లు ఇచ్చారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ ప్రజల సమస్యలకు వెంటనే స్పందించడం, ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించడం పోలీసుల ప్రధాన బాధ్యత అని చెప్పారు.

మిగతా 2లో

## నూతన కమిషనరేట్ భవనంపై డీజీపీ సమీక్ష



- ప్రజలకు మెరుగైన సేవలే లక్ష్యం
- ఆధునిక నిఘా వ్యవస్థలకు ప్రాధాన్యం
- రహదారులు, ప్రాంగణ అభివృద్ధికి సూచనలు

**వరంగల్, ఆగస్టు 9 (తెలంగాణ ముచ్చట్లు):**

నిర్మాణంలో ఉన్న వరంగల్ పోలీస్ కమిషనరేట్ నూతన కార్యాలయ భవనాన్ని రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ ఆదివారం పరిశీలించారు. నేర సమీక్ష సమావేశానికి ముందు కమిషనరేట్ భవన నిర్మాణ పనుల పురోగతిని స్వయంగా పరిశీలించి

మిగతా 2లో


డీజీపీ చేత గ్రీవెన్స్ పోర్టల్ ప్రారంభం

వరంగల్‌లో అమరవీరుల కుటుంబాలతో సమావేశం

పెండింగ్ సమస్యల పరిష్కారానికి హామీ



వరంగల్, ఆగస్టు 9 (తెలంగాణ ముచ్చట్లు): విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీస్ అమరవీరుల కుటుంబాల సంక్షేమానికి తెలంగాణ పోలీస్ శాఖ మరో కీలక అడుగు వేసింది. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పర్యటించిన రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్, నక్సలిజంపై పోరాటంలో అమరులైన 28 మంది పోలీస్ సిబ్బంది కుటుంబ సభ్యులతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అమరవీరుల కుటుంబాల కోసం ప్రత్యేకంగా రూపొందించిన 'టీజీవీర్' గ్రీవెన్స్ పోర్టల్‌ను ప్రారంభించారు. అమరవీరుల కుటుంబాలకు సంబంధించిన సమస్యలను ఒకే వేదికపై పరిష్కరించాలనే ఉద్దేశంతో



ఈ పోర్టల్‌ను రూపొందించినట్లు డీజీపీ తెలిపారు. ఆర్థిక సహాయం, ఎక్స్‌గ్రేషియా, కారుణ్య నియామకాలు, ఇంటి స్థలాల కేటాయింపు, పెన్షన్, సంక్షేమ పథకాలు, ఇతర ప్రభుత్వ ప్రయోజనాలకు సంబంధించిన ఫిర్యాదులను ఈ పోర్టల్ ద్వారా నమోదు చేసుకునే అవకాశం కల్పించారు. కుటుంబ సభ్యులు తమ సమస్యలను నేరుగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లే సౌలభ్యం ఇందులో ఉంటుందని వివరించారు.

అమరవీరుల ఉద్యోగ వివరాలు, కుటుంబ సభ్యుల సమాచారం, ఇప్పటివరకు అందిన ప్రయోజనాలు, సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వులు వంటి సమాచారాన్ని కూడా పోర్టల్‌లో పొందుపరుస్తున్నట్లు అధికారులు తెలిపారు. యూనిట్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు

మిగతా 2లో

## సాంబశివరెడ్డి మృతిపై మంత్రి పొంగులేటి దిగ్భ్రాంతి

- విద్యా రంగానికి తీరని లోటు: పొంగులేటి
- నిర్మల్ హృదయ్ పాఠశాల అధినేత కన్నుమూత
- ఆత్మీయ అనుబంధాన్ని గుర్తుచేసుకున్న మంత్రి
- కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి



**ఖమ్మం, ఆగస్టు 9 (తెలంగాణ ముచ్చట్లు):**

నిర్మల్ హృదయ్ పాఠశాల అధినేత, విద్యావేత్త వంగా సాంబశివరెడ్డి గుండెపోటుతో అకాల మరణం చెందడంపై తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

మిగతా 2లో

## లాల్‌దర్వాజా సింహవాహిని అమ్మవారికి పట్టువస్త్రాలు

బోనాల సందర్భంగా ప్రభుత్వ తరపున సమర్పించిన మంత్రులు

అమ్మవారిని దర్శించుకున్న పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు



**హైదరాబాద్, ఆగస్టు 9 (తెలంగాణ ముచ్చట్లు):** ఆషాఢమాస బోనాల ఉత్సవాల్లో భాగంగా లాల్‌దర్వాజాలోని శ్రీ సింహవాహిని మహంకాళి అమ్మవారి ఆలయంలో ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు మంత్రి కొండా సురేఖ, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ కలిసి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం మంత్రులు, ప్రజాప్రతినిధులు ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, రాష్ట్రంలో శాంతి, సౌభాగ్యాలు నెలకొనాలని అమ్మవారిని ప్రార్థించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని ఈ సందర్భంగా మంత్రులు పేర్కొన్నారు. ఆషాఢమాసంలో అమ్మవార్లకు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించడం తరతరాలుగా కొనసాగుతున్న సంప్రదాయమని తెలిపారు.

మిగతా 2లో




## సేవింగ్స్ అకౌంట్‌లో ఎంత డబ్బు ఉంచొచ్చు?

**న్యూఢిల్లీ ఆగస్టు 9 (తెలంగాణ ముచ్చట్లు):**

రోజువారీ ఖర్చులు, నగదు జమ, ఉపసంహరణ, ఆన్‌లైన్ లావాదేవీల కోసం దాదాపు ప్రతి ఒక్కరూ సేవింగ్స్ అకౌంట్‌ను వినియోగిస్తుంటారు. అయితే బ్యాంకు ఖాతాలో ఎంత డబ్బు ఉంచుకోవచ్చు? పెద్ద మొత్తంలో నగదు జమ చేస్తే లేదా విత్‌డ్రా చేస్తే

మిగతా 2లో

## ఆదివాసీల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

### మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

- గిరిజన సంక్షేమానికి భారీ కేటాయింపులు
- విద్య, ఉపాధిలో గిరిజన యువతకు ప్రోత్సాహం
- భాష, సంస్కృతి పరిరక్షణకు ప్రత్యేక చర్యలు

**హైదరాబాద్, ఆగస్టు 9 (తెలంగాణ ముచ్చట్లు):**

అడవులను కాపాడుకుంటూనే అభివృద్ధి దిశగా ఆదివాసీ సమాజం ముందుకు సాగాలని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా బంజారా భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గిరిజనుల హక్కులు, సంస్కృతి, భాషలు, సంప్రదాయాల పరిరక్షణతో పాటు వారి ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. 202627 ఆర్థిక సంవత్సరానికి గిరిజన

మిగతా 2లో



## పెద్ది కుటుంబానికి బీఆర్ఎస్ అండ

- నల్లబెల్లిలో పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన కేసీఆర్
- భావోద్వేగానికి గురై కంటతడి పెట్టుకున్న బీఆర్ఎస్ అధినేత
- రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం అందజేత
- పిల్లల భవిష్యత్తుకు పార్టీ అండగా ఉంటుందని హామీ

2లో



తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# పోలీసింగ్‌లో కొత్త సవాళ్లు

(మొదటి పేజీ తరువాయి)



తన పోలీసు సేవా జీవితానికి వరంగల్‌తో ప్రత్యేక అనుబంధం ఉందని డీజీపీ గుర్తు చేసుకున్నారు. జిల్లా శిక్షణతో ప్రారంభమైన తన సేవలు, అనంతరం వరంగల్ రూరల్ ఎస్పీగా పనిచేసిన రోజులు మరువలేనివని తెలిపారు. నక్సలిజం తీవ్రంగా ఉన్న కాలంలో ల్యాండ్‌మైన్ పేలుళ్లు, దాడుల మధ్య పోలీసులు విధులు నిర్వర్తించారని, నేడు రాష్ట్రంలో నెలకొన్న శాంతిభద్రతలు పోలీసు అమరుల త్యాగాల ఫలితమని పేర్కొన్నారు. గత ఏడాది తెలంగాణలో సైబర్ నేరాల కారణంగా ప్రజలు సుమారు రూ.1,700 కోట్లు కోల్పోయారని డీజీపీ వెల్లడించారు. మోసపోయిన వెంటనే ఫిర్యాదు చేస్తే డబ్బు తిరిగి పొందే అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. అధిక లాభాల పేరుతో జరిగే పెట్టుబడి మోసాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ దేశంలోనే తొలి స్థానంలో నిలవడం గర్వకారణమన్నారు. చిన్నారులను లక్ష్యంగా చేసుకుని చాక్లెట్ల రూపంలో మాదకద్రవ్యాలను వ్యాప్తి చేసే ప్రయత్నాలు ఆందోళనకరమని డీజీపీ పేర్కొన్నారు. ఇలాంటి నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రగ్స్ నియంత్రణలో విద్యాసంస్థలు, తల్లిదండ్రులు, పోలీసులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రజెంటేషన్‌లో కమిషనరేట్ పరిధిలో 50 పోలీస్ స్టేషన్లు ఉన్నాయని, 3,758 మంజూరైన పోస్టుల్లో 782 ఖాళీలు ఉన్నట్లు వెల్లడించారు. బీహార్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల నుంచి వచ్చి చైన్‌స్నాచింగ్, బైక్ చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం చేపట్టిన 'నేను సైతం' కార్యక్రమాన్ని డీజీపీ అభినందిస్తూ, సాంకేతిక ఆధారిత పోలీసింగ్‌ను మరింత విస్తరించి ప్రజల భద్రతను బలోపేతం చేయాలని అధికారులను ఆదేశించారు.

# అమరవీరుల కుటుంబాలకు టీజీ-వీర్ అండ

(మొదటి పేజీ తరువాయి)



అధికారులు ఫిర్యాదుల పరిష్కారాన్ని పర్యవేక్షించే విధంగా వ్యవస్థను రూపొందించారు. ఈ సందర్భంగా డీజీపీ క్యూఆర్ కోడ్‌తో కూడిన ప్రత్యేక కుటుంబ కార్డులను అమరవీరుల కుటుంబాలకు అందజేశారు. సమావేశంలో కుటుంబ సభ్యులు తమకు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను డీజీపీ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా ఎక్స్‌గ్రేషియా, ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్, టైటిల్ వివాదాలు, పెన్షన్, ఆర్థిక సహాయం వంటి అంశాలపై తమ ఇబ్బందులను వివరించారు. వాటిని సావధానంగా విన్న డీజీపీ, సంబంధిత సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ తన సేవా జీవిత ప్రారంభ దశలో నక్సలిజం తీవ్రంగా ఉన్న సమయంలో వరంగల్‌లో విధులు నిర్వహించిన విషయాన్ని గుర్తుచేసుకున్నారు. ఆ రోజుల్లో పోలీస్ సిబ్బంది ఎదుర్కొన్న క్లిష్ట పరిస్థితులు, ప్రాణాలకు తెగించి చేసిన సేవలు మరువలేనివని అన్నారు. నేడు రాష్ట్రంలో నెలకొన్న ప్రశాంత వాతావరణానికి పోలీస్ అమరవీరుల త్యాగాలే ప్రధాన కారణమని పేర్కొన్నారు. విధి నిర్వహణకు ప్రాణాల కంటే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చి దేశం, సమాజం కోసం త్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలను డీజీపీ స్మరించుకున్నారు. అమరవీరుల కుటుంబాలకు అన్ని విధాలా అండగా నిలవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేతకు ఆదేశాలు జారీ చేశారు. పోలీస్ అమరవీరుల కుటుంబాల సంక్షేమానికి తెలంగాణ పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు.



## నూతన కమిషనరేట్ భవనంపై
# డీజీపీ సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)

అధికారులతో చర్చించారు. భవన నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యే దశకు చేరుకున్న నేపథ్యంలో కొనసాగుతున్న పనుల వివరాలను వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత డీజీపీకి వివరించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ కొత్త కమిషనరేట్ కార్యాలయం ప్రజలకు మరింత చేరువయ్యేలా, సౌకర్యవంతంగా సేవలు అందించేలా రూపకల్పన ఉండాలని సూచించారు. పోలీసు సేవల కోసం వచ్చే ప్రజలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ పనులు పూర్తి చేసుకునే విధంగా భవన నిర్మాణం చేపట్టాలని తెలిపారు.

అంతర్గత పరిపాలనా సామర్థ్యాన్ని పెంచే విధంగా కార్యాలయ విభాగాలను ఏర్పాటు చేయాలని డీజీపీ ఆదేశించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగానికి అవసరమైన సదుపాయాలతో పాటు మెరుగైన నిఘా వ్యవస్థల ఏర్పాటుకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని సాంకేతిక ఆధారిత పోలీసింగ్‌కు అనుకూలంగా మౌలిక వసతులు కల్పించాలని పేర్కొన్నారు. కార్యాలయ ప్రాంగణంలో ఉపయోగంలో లేని, శిథిలావస్థకు చేరుకున్న నిర్మాణాలను తొలగించాలని డీజీపీ సూచించారు. కొత్త కమిషనరేట్ భవనానికి వెళ్లే అంతర్గత రహదారులను అభివృద్ధి చేయడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ప్రజలకు కార్యాలయం సులభంగా కనిపించేలా, సౌకర్యవంతంగా చేరుకునేలా ప్రాప్యతను మెరుగుపరచాలని డీజీపీ స్పష్టం చేశారు. స్పష్టమైన దిశా సూచికలు, అనుకూల వాతావరణం కల్పించడం ద్వారా ప్రజా సేవలను మరింత సమర్థవంతంగా అందించాలని సూచించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో ఐజీ ఇంటెలిజెన్స్ కార్తికేయ, వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఎస్పీ సింధు శర్మ, అడిషనల్ కలెక్టర్ రవి, అడిషనల్ ఎస్పీలు వినోద్, శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు. కొత్త కమిషనరేట్ భవనం త్వరలో ప్రజలకు అందుబాటులోకి వచ్చేలా పనులను వేగవంతం చేయాలని డీజీపీ అధికారులను ఆదేశించారు.


## లాల్‌దర్వాజా సింహవాహిని అమ్మవారికి
# పట్టువస్త్రాలు

(మొదటి పేజీ తరువాయి)

లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి ఆలయంలో బోనాల సందర్భంగా ప్రత్యేక పూజలు, ఉత్సవ కార్యక్రమాలు వైభవంగా కొనసాగుతున్నాయి. అమ్మవారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. ఆలయ పరిసరాల్లో భక్తి, ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ సంస్థల చైర్మన్లు, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, పోలీస్ కమిషనర్ సజ్జనార్, హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక ఆలా తదితరులు పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని నగరంలోని పలు అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేపట్టినట్లు వెల్లడించారు. తెలంగాణ ప్రజలందరికీ మంత్రులు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు.





# ఆదివాసీల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

సంక్షేమ రంగానికి రూ.18,745.16 కోట్లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. విద్య, రహదారులు, తాగునీరు, విద్యుత్, సాగునీరు, ఆరోగ్యం, మౌలిక వసతులు, నైపుణ్యాభివృద్ధి రంగాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. ఏ గిరిజన గ్రామం కూడా అభివృద్ధికి దూరంగా ఉండకుండా ప్రతి ఇంటికి మౌలిక సదుపాయాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గిరిజన విద్యార్థులు విద్యా రంగంలో విశేష ప్రతిభ కనబరుస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం 166 గిరిజన గురుకుల విద్యాసంస్థల్లో 83 వేల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీల్లో అత్యుత్తమ ఉత్తీర్ణత శాతాలు నమోదయ్యాయని, పలువురు విద్యార్థులు ఐఐటీలు, ఎన్ఐటీలు, నీట్‌లో విజయాలు సాధించారని చెప్పారు. భవిష్యత్తులో కృత్రిమ మేధ, డిజిటల్ విద్య, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను మరింత విస్తరిస్తామని వెల్లడించారు. అడవే గిరిజన జీవనానికి ఆధారం అని పేర్కొన్న మంత్రి, అటవీ సంపదను కాపాడుతూ ఆదాయ వనరులను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. తేనె, చింతపండు, ఔషధ మొక్కలు వంటి అటవీ ఉత్పత్తులకు విలువ జోడించి మార్కెటింగ్ అవకాశాలు కల్పించడం ద్వారా గిరిజనుల ఆదాయాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గిరిజన మహిళలకు స్వయం ఉపాధి, నైపుణ్యాభివృద్ధి అవకాశాలను విస్తరించనున్నట్లు చెప్పారు.

గిరిజన భాషలు, జానపద కళలు, సంప్రదాయాలు, చరిత్రను భావితరాలకు అందించడం అత్యంత అవసరమని మంత్రి పేర్కొన్నారు. హైదరాబాద్‌లో నిర్మిస్తున్న రాంజీగోండ్ గిరిజన స్వాతంత్ర్య సమర యోధుల మ్యూజియం గిరిజనుల పోరాట చరిత్రను భవిష్యత్ తరాలకు చేరవేస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం గిరిజన సంక్షేమాన్ని కార్యాచరణ స్థాయిలో అమలు చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ సంతోష్ బి.ఎం., ప్రజాప్రతినిధులు, గిరిజన నాయకులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన గిరిజన ప్రముఖులను, ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సన్మానించగా, గిరిజన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

## సాంబశివరెడ్డి మృతిపై మంత్రి పొంగులేటి దిగ్భ్రాంతి

(మొదటి పేజీ తరువాయి)

సాంబశివరెడ్డి మృతి తనను ఎంతో కలచివేసిందని పేర్కొన్నారు. సాంబశివరెడ్డితో తనకు ఆత్మీయ అనుబంధం ఉందని మంత్రి తెలిపారు. విద్యావేత్తగా ఖమ్మం ప్రాంతంలో విద్యా రంగ అభివృద్ధికి ఆయన అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు ఆయన చేసిన కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు.

సాంబశివరెడ్డి ఆకస్మిక మరణం విద్యా రంగానికి తీరని లోటని పొంగులేటి అన్నారు. ఆయన కుటుంబానికి కూడా ఇది పూడ్చలేని నష్టమని పేర్కొన్నారు. విద్యా రంగంలో ఆయన చేసిన సేవలను సమాజం ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని తెలిపారు.

సాంబశివరెడ్డి మృతితో ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు, విద్యాసంస్థల సిబ్బంది, విద్యార్థులు తీవ్ర విషాదంలో మునిగిపోయారని మంత్రి పేర్కొన్నారు. ఆయనతో అనుబంధం ఉన్న ప్రతి ఒక్కరికీ ఈ వార్త తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందన్నారు.

సాంబశివరెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని మంత్రి పొంగులేటి ప్రార్థించారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. విద్యా రంగానికి ఆయన అందించిన సేవలను స్మరించుకుంటూ కుటుంబ సభ్యులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# పెద్ది కుటుంబానికి బీఆర్ఎస్ అండ

వరంగల్, ఆగస్టు 9 (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణ ఉద్యమ నాయకుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే దివంగత పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదివారం నల్లబెల్లిలో పరామర్శించారు. పెద్ది స్వగృహానికి చేరుకున్న కేసీఆర్ ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. పరామర్శ సందర్భంగా పెద్ది సుదర్శన్‌రెడ్డి సేవలను స్మరించుకుంటూ కేసీఆర్ భావోద్వేగానికి గురయ్యారు. కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సమయంలో కంటతడి పెట్టుకున్నారు. పెద్ది మరణం పార్టీకి, తెలంగాణ ఉద్యమానికి తీరని లోటని పేర్కొన్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ తరఫున పెద్ది కుటుంబానికి రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం అందజేశారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి ఇద్దరు పిల్లలకు చెరో రూ.1 కోటి చొప్పున మొత్తం రూ.2 కోట్లు కేటాయించగా, ఆయన తల్లి అమృతమ్మ సంక్షేమం కోసం రూ.25 లక్షలను ఆమె పేరుతో బ్యాంకులో జమ చేయనున్నట్లు వెల్లడించారు. ఇందుకు సంబంధించిన పత్రాలను కుటుంబ సభ్యులకు అందజేశారు. పెద్ది పిల్లల చదువు, భవిష్యత్తు, కుటుంబ సంక్షేమానికి సంబంధించిన అంశాల్లో బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని కేసీఆర్ హామీ ఇచ్చారు. పార్టీ సీనియర్ నాయకులు, వరంగల్ జిల్లా ముఖ్య నేతలతో చర్చించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి దశదినకర్మ అనంతరం జిల్లా పార్టీ నాయకులతో సమావేశమై కుటుంబానికి అందించాల్సిన ఇతర సహాయ కార్యక్రమాలపై కూడా నిర్ణయాలు తీసుకుంటామని బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి. కుటుంబానికి అవసరమైన అన్ని విధాల సహకారం అందిస్తామని పేర్కొన్నాయి. కేసీఆర్ నల్లబెల్లి పర్యటన సందర్భంగా దారిపొడవునా బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలివచ్చి స్వాగతం పలికాయి. పలుచోట్ల కాన్వాయ్‌ను ఆపి కార్యకర్తలను పలకరించిన కేసీఆర్ వారికి ధైర్యం చెప్పారు. జై తెలంగాణ, జై కేసీఆర్ నినాదాలతో నల్లబెల్లి ప్రాంతం మార్మోగింది.



# సేవింగ్స్ అకౌంట్‌లో ఎంత డబ్బు ఉంచొచ్చు?

(మొదటి పేజీ తరువాయి)

ఆదాయపన్ను శాఖ నుంచి నోటీసులు వస్తాయా? అనే సందేహాలు చాలామందికి ఉంటాయి.

**నగదు నిల్వపై పరిమితి ఉందా?**

సాధారణ సేవింగ్స్ అకౌంట్‌లో ఎంత నగదు ఉంచుకోవాలనే దానిపై ప్రత్యేకంగా గరిష్ఠ పరిమితి ఉండదు. అయితే ఖాతాలో జరిగే భారీ నగదు లావాదేవీలపై బ్యాంకులు నిర్దిష్ట నిబంధనల ప్రకారం సమాచారాన్ని సంబంధిత పన్ను అధికారులకు నివేదించాల్సి ఉంటుంది.

ఒక ఆర్థిక సంవత్సరంలో సేవింగ్స్ ఖాతాలో రూ.10 లక్షలకు మించి నగదు జమ లేదా ఉపసంహరణ జరిగితే, ఆ లావాదేవీల వివరాలు పన్ను శాఖ దృష్టికి వెళ్లే అవకాశం ఉంటుంది. దీని అర్థం ఆ మొత్తాన్ని దాటిన వెంటనే పన్ను చెల్లించాల్సి వస్తుందని కాదు. అయితే లావాదేవీలకు సంబంధించిన ఆదాయ వనరులను అధికారులు పరిశీలించే అవకాశం ఉంటుంది.

**ఆదాయానికి సరిపోలకపోతే నోటీసు**

ఖాతాలో పెద్ద మొత్తంలో నగదు లావాదేవీలు జరుగుతున్నప్పటికీ, వాటికి సరైన ఆదాయ వనరులు లేకపోతే ఆదాయపన్ను శాఖ నుంచి వివరణ కోరే అవకాశం ఉంటుంది. డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది? దానికి సంబంధించిన ఆధారాలు ఏమిటి? అనే వివరాలను అడగవచ్చు.

అందువల్ల పెద్ద మొత్తంలో నగదు లావాదేవీలు నిర్వహించే వారు వాటికి సంబంధించిన బిల్లులు, రసీదులు, ఒప్పందాలు, బ్యాంకు రికార్డులు, ఆదాయానికి సంబంధించిన ఆధారాలను భద్రంగా ఉంచుకోవడం మంచిది.

**కరెంట్ ఖాతాల్లోనూ నిఘా**

కరెంట్ ఖాతాల విషయంలోనూ పెద్ద మొత్తంలో నగదు లావాదేవీలపై నివేదింపు నిబంధనలు ఉన్నాయి. ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.50 లక్షలకు మించిన నగదు జమ లేదా ఉపసంహరణ వంటి లావాదేవీలు పన్ను శాఖ దృష్టికి వెళ్లే అవకాశం ఉంటుంది.

**ఐటీఆర్‌లో వివరాలు కీలకం**

మీ ఆదాయ వనరులు స్పష్టంగా ఉండి, ఆదాయపన్ను రిటర్న్‌లో సరైన వివరాలను వెల్లడిస్తే పెద్ద మొత్తంలో లావాదేవీలు జరిగినంత మాత్రాన నోటీసు వస్తుందని భావించాల్సిన అవసరం లేదు. అయితే ఆదాయానికి, ఖాతాలో జరిగే లావాదేవీలకు మధ్య భారీ వ్యత్యాసం ఉంటే వివరణ కోరే అవకాశం ఉంటుంది.

అదేవిధంగా తరచూ పెద్ద మొత్తంలో నగదు జమ చేయడం, ఉపసంహరించడం లేదా అసాధారణమైన లావాదేవీలు నిర్వహించడం వల్ల పన్ను శాఖ పరిశీలనకు వచ్చే అవకాశం ఉంది. కాబట్టి పెద్ద లావాదేవీలకు సరైన ఆధారాలు ఉంచుకోవడం, ఆదాయాన్ని సక్రమంగా వెల్లడించడం, ఐటీఆర్‌లో వాస్తవ వివరాలు ఇవ్వడం చాలా ముఖ్యం.

తెలంగాణ
TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

సోమవారం - 10 - ఆగస్టు 2026



# వివాహేతర బంధానికి అడ్డుగా ఉందని.. అత్తను హతమార్చారు!





- అర్ధరాత్రి ఇంట్లోకి వెళ్లి చీరకొంగుతో గొంతు బిగించి హతమార్చిన నిందితులు.
- మృతదేహాన్ని పెట్రోల్‌తో దహనం చేసేందుకు రెండుసార్లు యత్నం.
- 65 ఏళ్ల వృద్ధురాలి హత్య కేసులో ఇద్దరి అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు.

**సత్తుపల్లి, ఆగస్టు 9 (తెలంగాణ ముచ్చట్లు):** వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉందనే కక్షతో అత్తను హత్య చేసి.. ఆనవాళ్లు లేకుండా చేసేందుకు మృతదేహాన్ని పెట్రోల్‌తో దహనం చేసిన ఘటన సత్తుపల్లి మండలంలో వెలుగుచూసింది. తుంబూరు గ్రామానికి చెందిన గుండాల వెంకట నర్సమ్మ (65)ను హత్య చేసిన కేసులో ఇద్దరు నిందితులను సత్తుపల్లి పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం నారాయణపురం-గురుభట్లగూడెం ఎక్స్‌రోడ్డు వద్ద నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారించగా నేరాన్ని అంగీకరించినట్లు తెలిపారు.

కనిపించకుండా పోయిన వృద్ధురాలు

తుంబూరు గ్రామానికి చెందిన గుండాల వెంకట నర్సమ్మ ఈ నెల 2న రాత్రి నుంచి కనిపించకుండా పోయింది. దీంతో ఆమె పెద్ద కుమార్తె వెదుళ్ల మంగమ్మ ఫిర్యాదు మేరకు ఆగస్టు 4న సత్తుపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. కేసు దర్యాప్తును సత్తుపల్లి సీఐ టి. శ్రీహరి చేపట్టారు. వైరా ఏసీపీ, కల్లూరు ఇన్‌చార్జి ఏసీపీ సాదుల సారంగపాణి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు.

వివాహేతర బంధమే కారణం

పోలీసుల వివరాల ప్రకారం.. తుంబూరుకు చెందిన వెదుళ్ల తిరుపతిరావు (55)కు ఇద్దరు భార్యలు ఉన్నారు. మొదటి భార్యకు దూరంగా ఉంటూ రెండో భార్య మంగమ్మతో తుంబూరులో నివసిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన భర్తను కోల్పోయిన పగుట్ల సునీత (35)తో కొంతకాలంగా తిరుపతిరావు వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ విషయం తిరుపతిరావు భార్య మంగమ్మ, ఆమె తల్లి వెంకట నర్సమ్మకు తెలియడంతో కుటుంబంలో తరచూ గొడవలు జరిగేవి. జూలై 30న దుద్దేపూడిలో సునీత పనిచేస్తున్న ఇంటి వద్దకు మంగమ్మ, వెంకట నర్సమ్మ వెళ్లి ఆమెను మందలించడంతో పాటు కొట్టినట్లు విచారణలో వెల్లడైంది. దీంతో అవమానానికి గురైన సునీత.. తమ సంబంధానికి అడ్డుగా ఉన్న వెంకట నర్సమ్మను హతమార్చాలని తిరుపతిరావుతో కలిసి పథకం వేసినట్లు పోలీసులు తెలిపారు.

అర్ధరాత్రి ఇంట్లోకి వెళ్లి..

పథకం ప్రకారం ఆగస్టు 2న అర్ధరాత్రి 12 గంటల సమయంలో తిరుపతిరావు, సునీత కలిసి వెంకట నర్సమ్మ ఇంటికి వెళ్లారు. తలుపు తెరిచి ఉండటంతో లోపలికి ప్రవేశించారు. ఆ సమయంలో వెంకట నర్సమ్మ కుర్చీలో కూర్చొని టీవీ చూస్తోంది. ఇద్దరూ కలిసి ఆమె చీర కొంగును మెడకు బిగించి హత్య చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.

మృతదేహాన్ని పెట్రోల్‌తో దహనం

హత్య అనంతరం మృతదేహాన్ని తిరుపతిరావు తన మోటార్‌సైకిల్‌పై మధ్యలో కూర్చోబెట్టుకున్నాడు. సునీత వెనుక కూర్చుంది. నారాయణపురం ఆంజనేయస్వామి ఆలయం దాటిన తర్వాత రోడ్డు పక్కన ఉన్న మోటార్‌సైకిల్‌లోని పెట్రోల్‌ను బాటిల్‌లోకి తీసుకుని మృతదేహంపై పోసి నిప్పంటించినట్లు పోలీసులు తెలిపారు. మరుసటి రోజు ఉదయం అక్కడికి వెళ్లి చూడగా మృతదేహం పూర్తిగా కాలకపోవడంతో మరిన్ని కొబ్బరి మట్టలు, చెత్తను దానిపై వేసి వెళ్లిపోయారు. ఆగస్టు 3న రాత్రి మరోసారి అక్కడికి వెళ్లి పరిశీలించగా శరీర భాగాలు మిగిలి ఉండటంతో వాటిని ఆకుపచ్చ రంగు గుడ్డ మ్యాట్‌లో చుట్టి కొద్దిదూరంలోని మరో ప్రాంతానికి తరలించారు. అక్కడ కూడా కట్టెలు, కొబ్బరి మట్టలు, చెత్తలో వేసి రెండు బాటిళ్లలో తెచ్చిన పెట్రోల్ పోసి తగులబెట్టినట్లు పోలీసుల విచారణలో తేలింది.

గ్రామ పెద్దకు చెప్పి.. పరారీ

హత్య చేసిన విషయాన్ని తిరుపతిరావు తుంబూరు సర్పంచ్ వీరబాబు, జీపీఓ ఎక్కిరాల లక్ష్మణ్‌కు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. తనను కాపాడాలని కోరగా.. పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి విషయం చెబుదామని, భయపడాల్సిన అవసరం లేదని వారు చెప్పినట్లు పేర్కొన్నారు. అనంతరం ఇంటికి వెళ్లి వస్తానని చెప్పిన తిరుపతిరావు అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు తెలిపారు. కేసులో తుంబూరుకు చెందిన వెదుళ్ల తిరుపతిరావు (55), పగుట్ల సునీత (35)ను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితులు ఉపయోగించిన మోటార్‌సైకిల్, ఇద్దరి సెల్‌ఫోన్లు, మృతురాలి బ్యాటరీ, సిమ్, వెనుక కవర్ లేని సెల్‌ఫోన్, రెండు ఖాళీ పెట్రోల్ బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ప్రత్యేక బృందాలతో దర్యాప్తు

సత్తుపల్లి సీఐ టి. శ్రీహరి ఆధ్వర్యంలో ఎస్ఐలు వీరప్రసాద్, ప్రదీప్, పోలీస్‌స్టేషన్ సిబ్బంది దర్యాప్తులో పాల్గొన్నారు. వైరా ఏసీపీ, కల్లూరు ఇన్‌చార్జి ఏసీపీ సాదుల సారంగపాణి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితులను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

# తిరుపతి కుటుంబానికి శ్రీ చైతన్య స్కూల్ చేయూత

- బస్ క్లీనర్ కుటుంబానికి రూ.45 వేల ఆర్థిక సాయం



**భీమదేవరపల్లి, ఆగస్టు 09 (తెలంగాణ ముచ్చట్లు):** శ్రీ చైతన్య టెక్నో స్కూల్ ఇందిరానగర్‌లో బస్ క్లీనర్‌గా పనిచేసిన గణబోయిన తిరుపతి అకస్మాత్తుగా గుండెనొప్పితో మృతి చెందారు. అందరితో ఆప్యాయంగా మెలిగే తిరుపతి ఇక లేరన్న వార్త విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బందిని తీవ్రంగా కలచివేసింది. ఆయన మృతితో కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది. ఈ నేపథ్యంలో తిరుపతి కుటుంబానికి అండగా నిలిచిన శ్రీ చైతన్య టెక్నో స్కూల్ యాజమాన్యం తమ వంతు సహాయంగా రూ.45 వేల ఆర్థిక సాయాన్ని అందించింది. కుటుంబానికి అండగా నిలిచి, ఆపద సమయంలో మానవత్వాన్ని చాటిన యాజమాన్యాన్ని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల యాజమాన్యం ,ఏజీఎం పద్మాకర్, ప్రిన్సిపల్ బండారి సంపత్, గ్లోబల్ ఐజిన్ చైర్మన్ వెలగ సునీల్ కుమార్, ప్రకాష్, ఉపాధ్యాయులు, తోటి డ్రైవర్లు, క్లీనర్లు తదితరులు పాల్గొన్నారు.

# బెన్నూరు ఆశన్నకు ఘనంగా సన్మానం



**ఖిల్లా ఘనపురం,ఆగస్టు09(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా ఖిల్లా ఘనపురం మండల కేంద్రంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నూతనంగా నియమితులైన బెన్నూరు ఆశన్నను బీజేపీ రాష్ట్ర నాయకులు అశ్విని నంద కుమార్, ఘనపురం బిజెపి నాయకులు ఘనంగా సన్మానించారు.ఇటీవల బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా బెన్నూరు ఆశన్న నియమితులైన సందర్భంగా మండల కేంద్రంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతోసత్కరించి,పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. బీజేపీలో ఓబీసీ మోర్చా బలోపేతానికి కృషి చేస్తూ, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు మరింత చురుగ్గా పని చేయాలని ఈ సందర్భంగా నాయకులు ఆకాంక్షించారు. తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా అవకాశం కల్పించిన పార్టీ నాయకత్వానికి బెన్నూరు ఆశన్న కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో బీజేపీ నాయకులు, ఘనపురం సంఘ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# చాముండి ఇండస్ట్రీస్ రైస్‌మిల్‌కు కూల్చివేత నోటీసు

**అనుమతులు,ఎన్ఓసీ లేకుండా నిర్మాణం.. 7 రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశం**






**పెద్దమందడి,ఆగస్టు09(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మోజర్ల గ్రామ పంచాయతీ పరిధిలోని ఎం/ఎస్. చాముండి ఇండస్ట్రీస్ రైస్‌మిల్‌కు సంబంధించిన అనధికారిక భవనంపై గ్రామ పంచాయతీ అధికారులు కూల్చివేత నోటీసు జారీ చేశారు. భవన నిర్మాణానికి గ్రామ పంచాయతీ నుంచి బిల్డింగ్ పర్మిషన్, ఎన్ఓసీ పొందలేదని నోటీసులో పేర్కొన్నారు.వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మోజర్ల గ్రామంలోని సర్వే నం. 327 ఏ ఏ/2లో చాముండి ఇండస్ట్రీస్ రైస్‌మిల్ ఉన్నట్లు గ్రామ పంచాయతీ అధికారులు తెలిపారు. సంబంధిత భవనానికి సంబంధించిన పత్రాలను సమర్పించడంతో పాటు ఆస్తి పన్ను చెల్లించాలని గతంలో జూలై 1న నోటీసు జారీ చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం జూలై 22న తదుపరి నోటీసు, ఆగస్టు 1న తుది నోటీసు ఇచ్చినప్పటికీ యాజమాన్యం నుంచి ఎలాంటి స్పందన రాలేదని తెలిపారు.

పత్రాలు సమర్పించలేదు.. వివరణ ఇవ్వలేదు

ఇప్పటివరకు గ్రామ పంచాయతీకి సంబంధిత భవనానికి సంబంధించిన ఎలాంటి పత్రాలు సమర్పించలేదని, లిఖితపూర్వక వివరణ కూడా ఇవ్వలేదని నోటీసులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆగస్టు 7న కూల్చివేతకు ముందు వివరణ కోరుతూ తాజా నోటీసు జారీ చేశారు.

7 రోజుల్లో సమాధానం ఇవ్వాలి

నోటీసు అందిన తేదీ నుంచి ఏడు రోజుల్లోగా అనధికారిక భవనాన్ని గ్రామ పంచాయతీ ఎందుకు కూల్చివేయకూడదో వివరణ ఇవ్వాలని అధికారులు ఆదేశించారు. నిర్ణీత గడువులో వివరణ ఇవ్వకపోయినా, ఇచ్చిన వివరణ సంతృప్తికరంగా లేకపోయినా అమలులో ఉన్న నిబంధనల ప్రకారం అనధికారిక భవనాన్ని కూల్చివేసే చర్యలు చేపడతామని స్పష్టం చేశారు.

ప్రభుత్వ ఉత్తర్వుల ఆధారంగా చర్యలు

వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వారి మౌఖిక ఆదేశాలతో పాటు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించిన జి.ఓ.ఎం.ఎస్. నం.52 (12032022), జి.ఓ.ఎం.ఎస్. నం.67 (26022002),జి.ఓ.ఎం.ఎస్.నం.168 (07042012)తో పాటు తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం-2018ను ఆధారంగా చేసుకుని నోటీసు జారీ చేసినట్లు గ్రామ పంచాయతీ అధికారులు తెలిపారు.

# జవహర్ నగర్ డంపింగ్ యార్డ్‌ను శాశ్వతంగా ఎత్తివేయాలి

- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతిపత్రం సమర్పించిన డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాట కమిటీ





**జవహర్ నగర్, ఆగస్టు 9 (తెలంగాణ ముచ్చట్లు):** జవహర్ నగర్ డంపింగ్ యార్డ్‌ను వెంటనే ఎత్తివేసి శాశ్వతంగా మూసివేయాలని డిమాండ్ చేస్తూ జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాట కమిటీ ఆధ్వర్యంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ కారణంగా నాలుగు మండలాల పరిధిలోని లక్షలాది మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కమిటీ సభ్యులు ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల ప్రాణాలు, ఆరోగ్యం మరియు పర్యావరణ పరిరక్షణ కోసం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.

ప్రధాన డిమాండ్లు

1. జవహర్ నగర్ డంపింగ్ యార్డ్‌ను వెంటనే ఎత్తివేయాలి.
2. డంపింగ్ యార్డ్‌ను శాస్త్రీయ పద్ధతిలో సైంటిఫిక్ కాప్పింగ్ చేసి, పర్యావరణ పునరుద్ధరణ చర్యలు చేపట్టాలి.
3. భూగర్భ జలాలు, గాలి కాలుష్య నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలి.
4. బాధిత ప్రాంతాల ప్రజలకు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి ఉచిత ఆరోగ్య పరీక్షలు, అవసరమైన వైద్య సేవలు అందించాలి.
5. ప్రజలకు పరిశుభ్రమైన మంచినీటిని ఉచితంగా అందించాలి.

డంపింగ్ యార్డ్ గత 25 సంవత్సరాలుగా హైదరాబాద్ నగరంలోని ఘన వ్యర్థాలను స్వీకరిస్తోందని, దాని కాలపరిమితి ముగిసినప్పటికీ గ్రేటర్ హైదరాబాద్ నుంచి చెత్తను తరలించి ఇక్కడే డంపింగ్ చేస్తున్నారని కమిటీ సభ్యులు తెలిపారు.
దీంతోపరిసర ప్రాంతాల కాలనీలు,గ్రామాల ప్రజలు తీవ్ర పర్యావరణ, ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. భూగర్భ జలాలు కలుషితం కావడం, గాలి కాలుష్యం, దుర్వాసన, మీథేన్ వాయువుల విడుదల వంటి సమస్యలు ప్రజల జీవనంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని తెలిపారు. ఈ పరిస్థితులపై శాస్త్రీయ అధ్యయనాలు, నిపుణుల కమిటీలు, సంబంధిత సంస్థల నివేదికలను కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.
ప్రజల ఆరోగ్యం, జీవించే హక్కు, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వంతో,సంబంధిత అధికారులతో చర్చించి తమ డిమాండ్లను అమలు చేయించేందుకు కృషి చేయాలని ఎంపీ ఈటల రాజేందర్‌ను కమిటీ సభ్యులు కోరారు.

అఖిలపక్ష సమావేశాలపై ఎంపీ స్పందన

వినతిపత్రంపై స్పందించిన ఎంపీ ఈటల రాజేందర్.. చిన్నగా ప్రారంభమైన జవహర్ నగర్ రాంకీ డంపింగ్ యార్డ్ కాలపరిమితి ముగిసినప్పటికీ ఇంకా కొనసాగుతుండటం సహించరాని విషయమని అన్నారు.
రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి తనను డంపింగ్ యార్డ్ అంశంపై అఖిలపక్ష కమిటీ చైర్మన్‌గా ఉండాలని కోరారని, ఆ మేరకు ఇప్పటికే రెండు, మూడు సార్లు సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు.
అయితే డంపింగ్ యార్డ్ ఎత్తివేత కోసం గతంలో పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమం నిర్వహించిన స్థానిక ప్రజలు, ఉద్యమకారులకు తెలియకుండా అఖిలపక్ష సమావేశాలు నిర్వహించడం సరైన విధానం కాదని పోరాట కమిటీ సభ్యులు ఎంపీకి వివరించారు.
జవహర్ ప్రజాహక్కుల పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో గతంలో డంపింగ్ యార్డ్ ఎత్తివేత కోసం పెద్ద ఎత్తున పోరాటం చేశామని, ఆ ఉద్యమం ఫలితంగానే కొంత మేర క్యాపింగ్ చేయించగలిగామని తెలిపారు. ప్రజా ఉద్యమాన్ని అణచివేసే ప్రయత్నంలో పలువురిపై తప్పుడు కేసులు నమోదు చేయడంతో పాటు మరికొందరిపై రౌడీషీట్లు కూడా తెరిచారని వారు పేర్కొన్నారు.
డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారంలో గతంలో పోరాడిన స్థానిక ప్రజలు, ఉద్యమకారులను కూడా భాగస్వామ్యం చేయాలని వారు ఎంపీ ఈటల రాజేందర్‌ను కోరారు. పలువురు నాయకుల పాల్గొనడం జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాట కమిటీ చైర్మన్ షేక్ షావలి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కోకన్వీనర్లు బీఆర్ఎస్‌కు చెందిన ఆలూరి రాజశేఖర్, గడ్డం సదానందం, సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, శంకర్ (సీపీఐ), చంద్రమౌళి (పీడీఎం రాష్ట్ర అధ్యక్షులు), ఏఐఎఫ్‌టీయూ వై. మల్లేష్, జయ చైతన్య మహిళా సంఘం, గడిపే సునీత (పీఓడబ్ల్యూ విముక్తి), వి. ప్రవీణ్ (టీయూసీఐ), సుర వెంకటయ్య (బీఎన్ఆర్‌కేఎస్), రావల్ కోల్ నర్సింహ గౌడ్ (మాజీ ఉప సర్పంచ్), దామాల ప్రభాకర్ రావు, జయసుధ (పీఓడబ్ల్యూ), వాసంశెట్టి శ్రీనివాసరావు, కొన్నె వేణు (జర్నలిస్ట్), బీఆర్ఎస్ ఏ. దుర్గం, పీడీఎస్‌యూ శ్యామ్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు. డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించి జవహర్ నగర్‌తో పాటు పరిసర ప్రాంతాల ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని ఈ సందర్భంగా నాయకులు డిమాండ్ చేశారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# జైలు భరో కార్యక్రమానికి కేవీపీఎస్ మద్దతు

- ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజా సంఘాలతో కలిసి పోరాటం
- కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వడ్లూరి కిషోర్



**జమ్మికుంట టౌన్ ఆగస్టు 09 (తెలంగాణ ముచ్చట్లు):** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ప్రజా సంఘాలు నిర్వహించనున్న జైలు భరో కార్యక్రమానికి కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం మద్దతు ప్రకటించింది. ఈ మేరకు కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వడ్లూరి కిషోర్ తెలిపారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు, కార్పొరేట్ సంస్థలకు అప్పగించే విధానాలను అవలంబించడం వల్ల కార్మికులు, వ్యవసాయ కార్మికులు, రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నారని ఆరోపించారు. పేదలకు అండగా ఉన్న ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. అదేవిధంగా రైతులకు కనీస మద్దతు ధర కల్పించకుండా రైతాంగానికి నష్టం కలిగించే విధానాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందని ఆరోపించారు. కార్మికుల హక్కులను కాలరాసేలా 29 కార్మిక చట్టాలను నాలుగు కార్మిక కోడ్‌లుగా మార్చారని, దీనివల్ల కార్పొరేట్ సంస్థలకు ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు.
ప్రజా సమస్యలపై కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రశ్నించేందుకు నిర్వహిస్తున్న జైలు భరో కార్యక్రమంలో ప్రజా సంఘాలు, దళిత సంఘాలు, కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వడ్లూరి కిషోర్ పిలుపునిచ్చారు.

# సాగునీటిపై బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం



- పెద్దమందడి కాంగ్రెస్ నాయకులు

**పెద్దమందడి,ఆగస్టు09(తెలంగాణ ముచ్చట్లు):** శ్రీశైలం నుంచి కేఎల్ఐ ద్వారా వనపర్తి నియోజకవర్గంలోని వివిధ మండలాలకు సాగునీటిని అందిస్తున్నామని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. సాగునీటి విషయంలో బీఆర్ఎస్ నాయకులు దుష్ప్రచారం చేస్తూ రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. ఆదివారం పెద్దమందడి మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు వెంకటస్వామి అధ్యక్షతన కాంగ్రెస్ నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులెవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని, ప్రజా ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని పేర్కొన్నారు. శ్రీశైలం నుంచి కేఎల్ఐ ద్వారా సాగునీటిని విడుదల చేసి వనపర్తి నియోజకవర్గంలోని వివిధ మండలాలకు నీటిని అందిస్తున్నట్లు తెలిపారు.పంపులు ప్రారంభమైన విషయం బీఆర్ఎస్ నాయకులకు కూడా తెలుసని కాంగ్రెస్ నాయకులు అన్నారు. పంపులు ప్రారంభించిన వెంటనే కాలువలకు నీరు చేరదని, పంపులు ప్రారంభించినప్పటి నుంచి దాదాపు 15 రోజులకు సాగునీరు అందుతుందనే విషయం బీఆర్ఎస్ నాయకులకు తెలియదా అని ప్రశ్నించారు. ఈ విషయాన్ని తెలుసుకోకుండా సాగునీటిపై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా దుష్ప్రచారమేనని విమర్శించారు.వాస్తవ పరిస్థితులను తెలుసుకోకుండా రైతులను ఆందోళనకు గురిచేసేలా ప్రకటనలు చేయడం సరికాదన్నారు. రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని, సాగునీరు అందించే విషయంలో ప్రజా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని కాంగ్రెస్ నాయకులు భరోసా ఇచ్చారు. బీఆర్ఎస్ నాయకులు వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వెంకటస్వామి, మాజీ ఎంపీపీ రఘు ప్రసాద్, పెద్దమందడి , ఖిల్లా గణపురం మండలాల మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి, పెద్దమందడి సర్పంచ్ సూర్య గంగా రవి, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

# క్రీడలతో ఆరోగ్యకరమైన జీవనశైలి



- జిల్లెల్ల చిన్నారెడ్డి

**వనపర్తి,ఆగస్టు09(తెలంగాణ ముచ్చట్లు):** క్రీడలు ఆరోగ్యకరమైన జీవనశైలికి ఎంతో మేలు చేస్తాయని తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. వనపర్తి పాలిటెక్నిక్ గ్రౌండ్‌లో నిర్వహించిన ఆరేపల్లి వెంకటేశ్వర్లు స్మారక 72వ స్టేట్ సీనియర్ మెన్, ఉమెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ బహుమతుల ప్రధానోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు.బ్యాడ్మింటన్ శారీరక దృఢత్వంతో పాటు మానసిక చురుకుదనాన్ని పెంపొందిస్తుందని, క్రీడలతో క్రమశిక్షణ, పట్టుదల, సమయపాలన అలవడతాయని అన్నారు. క్రీడాకారులు నిరంతరం సాధన చేస్తూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి ఒలింపిక్స్‌లో పాల్గొని పతకాలు సాధించాలని పిలుపునిచ్చారు. క్రీడల్లో మహిళల భాగస్వామ్యం పెరగడం అభినందనీయమన్నారు. మహిళల విభాగంలో రంగారెడ్డి జట్టు విజేతగా, వరంగల్ జట్టు రన్నర్‌గా, పురుషుల విభాగంలో వరంగల్ జట్టు విజేతగా, నల్గొండ జట్టు రన్నర్‌గా నిలిచాయి. టోర్నమెంట్ నిర్వాహకులు, క్రీడాకారులు, కోచ్‌లు, క్రీడాభిమానులకు చిన్నారెడ్డి అభినందనలు తెలిపారు.కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, బాబా, ద్వారపోగు విజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# అక్షర జ్ఞాపకాలకు నివాళి..

**కుటుంబానికి రూ.17 వేల ఆర్థిక చేయూత**



**భీమదేవరపల్లి, ఆగస్టు 9 (తెలంగాణ ముచ్చట్లు):** భీమదేవరపల్లి మండలం మాణిక్యపూర్ గ్రామానికి చెందిన ఎలిగేటి ప్రవళిక-రమేష్ దంపతుల కుమార్తె అక్షర ఇటీవల మృతి చెందడంతో కుటుంబంలో విషాదం నెలకొంది. ఈ కష్ట సమయంలో ప్రవళికతో కలిసి చదువుకున్న శ్రీ సరస్వతి శిశు మందిర్ పూర్వ విద్యార్థులు మానవత్వాన్ని చాటుకున్నారు.అక్షర కుటుంబాన్ని పరామర్శించిన పూర్వ విద్యార్థులు రూ.17 వేల ఆర్థిక సహాయం అందించి కుటుంబానికి అండగా నిలిచారు. అనంతరం అక్షర చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.
చదువుకున్న రోజుల జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ, ఆపద సమయంలో కుటుంబానికి తోడుగా నిలవడం ద్వారా పూర్వ విద్యార్థులు తమ ఆత్మీయతను, మానవతా విలువలను చాటుకున్నారు. అక్షర కుటుంబానికి ఈ ఆర్థిక సహాయం కొంతమేరకు భరోసానిచ్చింది.





# కొమరం భీమ్ స్ఫూర్తితో హక్కుల సాధనకు ముందుకు సాగాలి

- ఆదివాసీ సమాజం అభివృద్ధి వైపు అడుగులు వేయాలి.
- అశ్వారావుపేటలో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు.



**అశ్వారావుపేట, ఆగస్టు 9 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్రంలో ఆదివాసీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రింగ్‌రోడ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కొమరం భీమ్ విగ్రహాన్ని తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) ఆవిష్కరించారు. జిల్లా కలెక్టర్ అంకిత్, స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. ఆదివాసీ సమాజానికి ప్రత్యేకమైన జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలు దేశానికి గొప్ప వారసత్వమని పేర్కొన్నారు. అడవిని తల్లిగా భావించి ప్రకృతితో మమేకమై జీవించే ఆదివాసీల జీవన విధానం ఎంతో విశిష్టమైనదన్నారు. అడవులు, కొండలు, వాగులు, ప్రకృతి వనరుల పరిరక్షణలో ఆదివాసీల పాత్ర కీలకమని తెలిపారు. ఆదివాసీ సమాజం అభివృద్ధి చెందాలంటే విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రతి కుటుంబం తమ పిల్లలను తప్పనిసరిగా పాఠశాలకు పంపించాలని, ఉన్నత విద్యతోనే సామాజికంగా మార్పు సాధ్యమవుతుందని అన్నారు. యువత విద్యతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకుని పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న విద్య, ఉపాధి, సంక్షేమ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మహిళలు విద్యతో పాటు ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. స్వయం సహాయక సంఘాల ద్వారా ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. ఆదివాసీ మహిళల్లోని ప్రతిభను వెలికితీసేందుకు మరిన్ని అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కొమరం భీమ్ ఆదివాసీ హక్కుల కోసం చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని వక్తలు పేర్కొన్నారు. 'జల్, జంగల్, జమీన్' కోసం ఆయన సాగించిన పోరాటాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని పిలుపునిచ్చారు. కొమరం భీమ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు నిజమైన నివాళి అని అన్నారు. భూమి, అటవీ హక్కులు, విద్య, ఉపాధి, వైద్యం తదితర అంశాలపై ప్రతి కుటుంబం అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగి వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హక్కుల సాధన కోసం ఆదివాసీ సమాజం చైతన్యవంతంగా, ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి పేరుతో ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు దెబ్బతినకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఆదివాసీ భాషలు, కళలు, నృత్యాలు, జానపద సంప్రదాయాలను పరిరక్షించుకోవాలని సూచించారు. తమ సంస్కృతిని గౌరవించడంతో పాటు ఆధునిక సమాజంతో పోటీపడేలా యువత నైపుణ్యాలను పెంపొందించుకోవాలని తెలిపారు. ప్రకృతి సంపదను కాపాడుకుంటూనే జీవనోపాధిని మెరుగుపరుచుకునే మార్గాలను అన్వేషించాలని సూచించారు. అటవీ ఉత్పత్తులను సద్వినియోగం చేసుకుని విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, స్వయం ఉపాధి అవకాశాల వైపు యువత దృష్టి సారించాలని కోరారు. ఆదివాసీ ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, విద్యుత్, విద్య, వైద్య సౌకర్యాలను మరింత మెరుగుపరచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాల్లోని సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆదివాసీ సమాజం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని తెలిపారు. ఆరోగ్యంపై ప్రతి కుటుంబం ప్రత్యేక శ్రద్ధ చూపాలని, పిల్లలకు పోషకాహారం అందించాలని సూచించారు. మూఢనమ్మకాలకు దూరంగా ఉంటూ శాస్త్రీయ దృక్పథంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ దినోత్సవం కేవలం వేడుకలకు పరిమితం కాకుండా సమాజ అభివృద్ధికి మార్గదర్శకంగా నిలవాలని వక్తలు ఆకాంక్షించారు. చైతన్యం, విద్య, ఐక్యతతోనే ఆదివాసీ సమాజం అన్ని రంగాల్లో ప్రగతి సాధిస్తుందని పేర్కొన్నారు. సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూనే ఆధునిక అభివృద్ధి వైపు అడుగులు వేయాలని, కొమరం భీమ్ ఆశయాల సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

# శిథిలావస్థలో బీసీ బాలుర వసతి గృహం

- తక్షణమే నూతన భవనం నిర్మించాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి



**జమ్మికుంట టౌన్ ఆగస్టు 09 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట పట్టణంలో ఐదు దశాబ్దాల క్రితం నిర్మించిన బీసీ బాలుర వసతి గృహం శిథిలావస్థకు చేరిందని, వెంటనే నూతన భవనాన్ని నిర్మించి విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో నాయకులు ఆదివారం బీసీ బాలుర వసతి గృహాన్ని సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు.
ఈ సందర్భంగా వసతి గృహంలో 56 మంది విద్యార్థులు ఉంటున్నారని, వారికి కనీస సౌకర్యాలు కూడా సక్రమంగా అందడం లేదని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఐదు దశాబ్దాల నాటి భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో స్లాబ్, గోడల నుంచి తరచూ పెచ్చులు ఊడిపడుతున్నాయని తెలిపారు. దీంతో విద్యార్థులు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు.
విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించాలని వాసుదేవరెడ్డి కోరారు. శిథిల భవనంలో విద్యార్థులను కొనసాగించడం ప్రమాదకరమని, వెంటనే వారిని సురక్షితమైన భవనానికి తరలించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు, పాత భవనాన్ని తొలగించి అన్ని సౌకర్యాలతో కూడిన నూతన బీసీ బాలుర వసతి గృహాన్ని నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థుల భద్రత విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా తక్షణ చర్యలు చేపట్టాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు.

# తాటిపాముల వెంకటేశం దశదినకర్మకు ప్రముఖుల హాజరు



- సంగెం సత్యనారాయణతో పాటు బీసీ జేఏసీ నాయకుల నివాళులు

**హుజురాబాద్, ఆగస్టు 9(తెలంగాణ ముచ్చట్లు ):**హుజురాబాద్ పట్టణానికి చెందిన శ్రీరామ ఐరన్ షాప్ యజమాని, ప్రముఖ వ్యాపారవేత్త తాటిపాముల వెంకటేశం ఇటీవల మృతి చెందగా, ఆదివారం నిర్వహించిన దశదినకర్మ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు, వ్యాపారవేత్తలు, వివిధ సంఘాల నాయకులు హాజరై ఘనంగా నివాళులర్పించారు.

తాటిపాముల వెంకటేశం చిన్న ఐరన్ షాపుతో తన వ్యాపార ప్రస్థానాన్ని ప్రారంభించి అంచెలంచెలుగా ఎదిగి హుజురాబాద్ పట్టణంలో ప్రముఖ పారిశ్రామికవేత్తగా, వ్యాపారవేత్తగా మంచి గుర్తింపు పొందారని పలువురు కొనియాడారు. పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాలు, మండలాల్లోని ప్రజలకు కూడా ఆయన సుపరిచితుడిగా ఉండేవారని పేర్కొన్నారు.

వెంకటేశం మృతి విషయం తెలుసుకున్న హుజురాబాద్ పట్టణంతో పాటు వివిధ మండలాలకు చెందిన వ్యాపారవేత్తలు, ప్రముఖులు, హైదరాబాద్‌కు చెందిన పలువురు కూడా దశదినకర్మ కార్యక్రమానికి హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర పద్మశాలి సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ సంగెం సత్యనారాయణ, బీసీ జేఏసీ నాయకులు చిలుకమారి శ్రీనివాస్, ఇప్పకాయల సాగర్, మామునూరి ప్రవీణ్, ఇప్పలపల్లి చంద్రశేఖర్, కేసీ రెడ్డి నరసింహారెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

అనంతరం తాటిపాముల వెంకటేశం కుమారుడు తాటిపాముల శ్రీనివాస్, మనుమలు ఇప్పలపల్లి చంద్రశేఖర్, ఇప్పలపల్లి నరేశ్‌ను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వెంకటేశం కుటుంబానికి ఈ విషాద సమయంలో ఆ భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని వారు ఆకాంక్షించారు.

కార్యక్రమంలో పలువురు వ్యాపారవేత్తలు, బంధుమిత్రులు, స్థానిక ప్రముఖులు పాల్గొని వెంకటేశం మృతికి సంతాపం వ్యక్తం చేశారు

# బోనాల సందడితో పులకించిన ఇల్లందకుంట పాఠశాల





- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలపై విద్యార్థులకు అవగాహన



**ఇల్లందకుంట, ఆగస్టు 09 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. సంప్రదాయ బోనాలను అందంగా అలంకరించిన విద్యార్థులు వాటిని నెత్తిన ఎత్తుకొని పాఠశాల ప్రాంగణంలో ఉత్సాహంగా ఊరేగింపు నిర్వహించారు. దీంతో పాఠశాల ప్రాంగణం తెలంగాణ పల్లె సంస్కృతిని ప్రతిబింబించేలా పండుగ శోభను సంతరించుకుంది.

ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు సిహెచ్. వేణు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు మరింత ప్రాధాన్యం లభించిందన్నారు. బోనాల వంటి పండుగలను విద్యార్థులతో నిర్వహించడం ద్వారా తెలంగాణ సంస్కృతి, పూర్వీకుల ఆచారాలు, సంప్రదాయ పండుగల ప్రాశస్త్యాన్ని నేటి తరానికి పరిచయం చేయవచ్చని తెలిపారు. విద్యార్థులు సంప్రదాయ వేడుకల్లో ప్రత్యక్షంగా పాల్గొనడం వల్ల మన సంస్కృతిపై అవగాహనతో పాటు గౌరవభావం పెంపొందుతుందని పేర్కొన్నారు. ఆషాఢ మాస ప్రత్యేకతను చాటుతూ గోరింటాకు వేడుకలను కూడా విద్యార్థులు ఉత్సాహంగా నిర్వహించారు. విద్యార్థినులు తమ చేతులకు గోరింటాకు పెట్టుకుని ఆనందోత్సాహాలతో సందడి చేశారు. బోనాల ఊరేగింపు, గోరింటాకు వేడుకలతో పాఠశాల ప్రాంగణం అంతా పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిహెచ్. వేణు, కే. జయప్రకాష్, ఎం. సమ్మిరెడ్డి, సిహెచ్. కౌసల్య, జి. అన్నపూర్ణ, కే. సత్యం, ఏ. సురేష్, సిహెచ్. రామకృష్ణ, కే. శంకర్, జె. రాధిక రాణి, ఎం. సుధాకర్, డి. ఉమాదేవి, ఎం. స్రవంతి, యు. లక్ష్మణచారి, ఆర్. దేవేందర్, డి. పరమేశ్వర్, వనిత, విశ్వతేజతో పాటు విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు.



# క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిద్దాం

- గాంధీ భవన్‌లో జాతీయ జెండా ఆవిష్కరణ
- స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలకు నివాళి
- ప్రత్యేక ప్రదర్శనను తిలకించిన మంత్రులు

**హైదరాబాద్, ఆగస్టు 9 (తెలంగాణ ముచ్చట్లు):** క్విట్ ఇండియా ఉద్యమ దినోత్సవం సందర్భంగా గాంధీ భవన్‌లో టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, వాకాటి శ్రీహరి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అజారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించి స్వాతంత్ర్య సమరయోధులకు ఘన నివాళులర్పించారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో క్విట్ ఇండియా ఉద్యమం కీలక ఘట్టమని, మహాత్మా గాంధీ ఇచ్చిన పిలుపు దేశ ప్రజల్లో స్వేచ్ఛా స్ఫూర్తిని మరింత బలపరిచిందని నాయకులు పేర్కొన్నారు. అనంతరం గాంధీ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శనను సందర్శించారు. స్వాతంత్ర్య పోరాటానికి సంబంధించిన అరుదైన చిత్రాలు, చారిత్రక పత్రాలు, ఉద్యమ విశేషాలను పరిశీలించి నిర్వాహకులను అభినందించారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగాలు చేసిన మహనీయుల సేవలను భావితరాలకు చేరవేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని నేతలు అన్నారు. ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుకోవడమే వారికి నిజమైన నివాళి అవుతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ స్వాతంత్ర్య ఉద్యమ వారసత్వాన్ని ప్రజలకు గుర్తు చేస్తూ జాతీయ సమైక్యత, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తుందని నాయకులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రామడుగులో యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు





**రామడుగు, ఆగస్టు 9 (తెలంగాణ ముచ్చట్లు):** రామడుగు మండల కేంద్రంలో యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అనుపురం పరశురామ్ గౌడ్ ఆధ్వర్యంలో యువజన కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ యువతను రాజకీయ, సామాజిక కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం డైరెక్టర్, యువజన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మామిడి దిలీప్ కుమార్, సీనియర్ నాయకులు బుర్ర శ్రీనివాస్ గౌడ్, పల్లె రామ్ రెడ్డి, సిరికొండ సాయి తేజ, మండల సామాజిక మాధ్యమాల సమన్వయకర్త మిల్కీ, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు జవ్వాజి అజయ్, పూరేళ్ల రాహుల్, రామ్ ప్రసాద్, శేఖర్, హరిచరన్, శ్రీనివాస్, విజయ్, మణి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మల్లేశం, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు

- పలుస శంకర్ గౌడ్ వనపర్తి జిల్లా సాహితీ కళావేదిక అధ్యక్షులు



**వనపర్,ఆగస్టు09(తెలంగాణ ముచ్చట్లు-):**తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్ అన్నారు. హైదరాబాద్‌లోని బండ్లగూడ జాగీర్‌లో గల కాలికా మాత దేవాలయంలో ఆదివారం నిర్వహించిన బోనాల పండుగ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమ్మ మహంకాళి ఆశీస్సులు తెలంగాణ ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. బోనం సమర్పించే ప్రతి ఆడపడుచుకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. పసుపు, కుంకుమ, చీర, గాజులతో అలంకరించిన బోనం తెలంగాణ సంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు.డప్పుల చప్పుళ్లు, పోతురాజుల నృత్యాలు, శివసత్తుల విన్యాసాలు, బోనాల ఊరేగింపులతో పండుగ వాతావరణం భక్తి పారవశ్యంతో నిండిపోతుందని పేర్కొన్నారు. గోల్కొండ నుంచి సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి వరకు బోనాల వేడుకలు భక్తులను ఆకట్టుకుంటాయని అన్నారు.అమ్మవారి దయతో రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు పండాలని, ప్రతి ఇంటా సుఖసంతోషాలు, ఆరోగ్యం, ఐశ్వర్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. కుల, మతాలకు అతీతంగా ప్రజలందరూ ఐక్యంగా పండుగను జరుపుకోవాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఆడబిడ్డల భక్తి, త్యాగానికి బోనాలు ప్రతీక అని అన్నారు. రంగం కార్యక్రమంలో వెల్లడయ్యే భవిష్యవాణి ప్రజలకు మార్గదర్శకంగా నిలుస్తుందని, అమ్మవారికి సమర్పించే బోనం కృతజ్ఞతకు నిదర్శనమని తెలిపారు. పేద, ధనిక అనే తేడా లేకుండా అందరూ అమ్మవారి పాదాల చెంత ఒక్కటవడం బోనాల పండుగ ప్రత్యేకత అన్నారు. బోనాల సందడిలో ప్రజల మధ్య బంధాలు మరింత బలపడాలని ఆకాంక్షించారు.యువత తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను గర్వంగా ముందుకు తీసుకెళ్లాలని పలుస శంకర్ గౌడ్ సూచించారు. అమ్మ మహంకాళి కరుణతో ప్రతి కుటుంబం కష్టాల నుంచి రక్షించబడాలని ప్రార్థించారు .ఈ వేడుకల్లో మాజీ సర్పంచ్, చింతకుంట మండల ఉపాధ్యక్షులు ఉండ్యాల దయాకర్ గౌడ్, సుజాత, పవన్ గౌడ్, కావ్యశ్రీ, శైలజ, మిథున్, సాయి పృథివి, సాయి వంశీ, అన్విక, ధ్రువ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో జనసేన కార్యకర్తల ఆత్మీయ సమావేశం

**కరీంనగర్, ఆగస్టు 9 (తెలంగాణ ముచ్చట్లు):** జనసేన పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ కార్యకర్తల ఆత్మీయ సమావేశం శనివారం కరీంనగర్‌లోని వాసర గార్డెన్స్‌లో ప్రారంభమైంది. రాష్ట్ర నాయకుడు డాక్టర్ బండారు రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. పార్టీ కార్యకర్తలతో ఆత్మీయంగా సమావేశమై క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితులు, కార్యకర్తల సమస్యలు, భవిష్యత్ కార్యక్రమాలపై చర్చించేందుకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో జనసేనను మరింత బలోపేతం చేసే అంశాలపై నేతలు దృష్టి సారించారు. సమావేశానికి జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రామ్, తెలంగాణ రాష్ట్ర ఇన్‌ఛార్జి నేమూరి శంకర్‌గౌడ్ హాజరయ్యారు. పార్టీ ప్రచార కార్యదర్శి సాగర్ ఆర్.కె. నాయుడు కూడా పాల్గొన్నారు.

రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులతో పాటు జనసైనికులు, వీర మహిళలు పెద్ద సంఖ్యలో సమావేశానికి తరలివచ్చారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం, ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలో పనిచేయడం వంటి అంశాలపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేయనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్ఠం చేయడంతో పాటు కార్యకర్తల మధ్య సమన్వయాన్ని పెంచేందుకు ఇలాంటి సమావేశాలు ఉపయోగపడతాయని నాయకులు పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలతో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకోవడమే సమావేశం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. సమావేశంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు పార్టీ భవిష్యత్ కార్యక్రమాలపై చర్చించారు. కరీంనగర్‌లో జనసేనను క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు సమష్టిగా పనిచేయాలని ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు సంకల్పం వ్యక్తం చేశాయి.

# ఉపాధ్యాయుడిగా అద్భుత సేవలు.. వెంకటస్వామికి ఘన సన్మానం

- పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, అతిథుల ఘన సన్మానం



**హుజురాబాద్, ఆగస్టు 9(తెలంగాణ ముచ్చట్లు ):** ఉపాధ్యాయుడిగా తన ఇరవై ఏడు ఏళ్ల ఏళ్ల పదవీ కాలంలో విద్యార్థుల బాగోగులు, విద్యాభివృద్ధి కోసం అంకితభావంతో పని చేసిన రుద్రారపు వెంకటస్వామి సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు.

ఆదివారం హుజురాబాద్ పట్టణంలోని విశేష కన్వెన్షన్ హాల్‌లో పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుడు రుద్రారపు వెంకటస్వామి సన్మాన సభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. వెంకటస్వామి తన ఇరవై ఏడుఏళ్ల సేవా కాలంలో విద్యార్థుల అభివృద్ధి కోసం ఎంతో శ్రమించారని అన్నారు. విద్యార్థుల చదువుతో పాటు వారి భవిష్యత్తు, వ్యక్తిత్వ వికాసంపై ప్రత్యేక శ్రద్ధ చూపారని పేర్కొన్నారు.

విద్యారంగానికి వెంకటస్వామి చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన అంకితభావం, సేవా స్ఫూర్తి ఇతర ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలిచాయని వక్తలు తెలిపారు. ఉపాధ్యాయ వృత్తిని బాధ్యతగా భావించి విద్యార్థుల ఉన్నతికి కృషి చేసిన ఆయనను అభినందించారు.

ఈ సందర్భంగా రుద్రారపు వెంకటస్వామి దంపతులను పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, అతిథులు, బంధువులు, మిత్రులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. పదవీ విరమణ అనంతరం ఆయన ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.

కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్, డీటీఎఫ్ నాయకులు వేల్పుల రత్నం, సోల్లు బాబు, బిక్షపతి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



# మరుగున పడుతున్న చేతివృత్తులు

- **ఉపాధికి ఒకప్పుడు ఆధారం**
- **యంత్రాల పోటీలో వెనుకబడిన కళలు**
- **తరతరాల వారసత్వానికి ముప్పు**
- **పరిరక్షణకు సమష్టి కృషి అవసరం**

**డెస్క్, ఆగస్టు 09 (తెలంగాణ ముచ్చట్లు):** భారతీయ సమాజ నిర్మాణంలో చేతివృత్తులకు విశిష్ట స్థానం ఉంది. కుమ్మరి, కమ్మరి, వడ్రంగి, చేనేత కార్మికులు, బుట్టల అల్లేవారు, స్వర్ణకారులు, కంసాలీలు వంటి అనేక వర్గాలు తమ సంప్రదాయ వృత్తులతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలమైన పునాదిగా నిలిచాయి. ఒకప్పుడు ప్రతి గ్రామం స్వయం సమృద్ధిగా ఉండటానికి ఈ వృత్తిదారులే ప్రధాన కారణం. ప్రజల రోజువారీ అవసరాల నుంచి వ్యవసాయ పనిముట్ల వరకు అన్నింటినీ వారు అందించేవారు. అయితే కాలక్రమేణా పరిస్థితులు మారడంతో ఈ చేతివృత్తులు క్రమంగా మరుగున పడుతున్నాయి. సాంకేతిక అభివృద్ధి, యాంత్రీకరణ, భారీ ఉత్పత్తి విధానాలు చేతివృత్తులపై తీవ్ర ప్రభావం చూపాయి. యంత్రాలతో తక్కువ సమయంలో అధిక ఉత్పత్తి సాధ్యమవుతుండటంతో సంప్రదాయ కళాకారులు పోటీని తట్టుకోలేకపోతున్నారు. కర్మాగారాల్లో తయారయ్యే వస్తువులు తక్కువ ధరలకు అందుబాటులోకి రావడం కూడా వారి ఉపాధిని దెబ్బతీసింది. ఫలితంగా అనేక కుటుంబాలు తమ పూర్వీకుల వృత్తులను విడిచిపెట్టి ఇతర పనుల వైపు మళ్లాల్సి వస్తోంది.

చేనేత రంగం ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణగా చెప్పవచ్చు. ఒకప్పుడు దేశవ్యాప్తంగా వేలాది కుటుంబాలకు జీవనాధారంగా ఉన్న ఈ రంగం నేడు అనేక సమస్యలను ఎదుర్కొంటోంది. ముడి పదార్థాల ధరలు పెరగడం, మార్కెట్‌లో పోటీ అధికమవడం, మధ్యవర్తుల ఆధిపత్యం వంటి కారణాల వల్ల చేనేత కార్మికులు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నారు. సంప్రదాయ నైపుణ్యంతో తయారయ్యే వస్త్రాలకు తగిన ప్రోత్సాహం లేకపోవడం కూడా పరిస్థితిని మరింత క్లిష్టం చేస్తోంది. కుమ్మరి వృత్తి పరిస్థితి కూడా అంతే ఆందోళనకరంగా ఉంది. మట్టి పాత్రలు, కుండలు, గృహోపకరణాలకు ఒకప్పుడు మంచి డిమాండ్ ఉండేది. ఇప్పుడు వాటి స్థానంలో ప్లాస్టిక్, ఉక్కు, ఇతర ఆధునిక వస్తువులు వచ్చాయి. పర్యావరణానికి మేలు చేసే మట్టి ఉత్పత్తుల వినియోగం తగ్గిపోవడంతో ఈ వృత్తిపై ఆధారపడిన కుటుంబాల ఆదాయం క్షీణిస్తోంది. ఇదే పరిస్థితి అనేక ఇతర చేతివృత్తులలో కూడా కనిపిస్తోంది.

చేతివృత్తులు కేవలం ఉపాధి మార్గాలు మాత్రమే కావు. అవి భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, కళాత్మకతకు ప్రతీకలు. తరతరాలుగా సంక్రమించిన నైపుణ్యం, సృజనాత్మకత, స్థానిక ప్రత్యేకత ఈ వృత్తుల్లో ప్రతిఫలిస్తాయి. ఒక వృత్తి కనుమరుగైతే కేవలం ఉపాధి అవకాశమే కాదు, దానితో ముడిపడిన సాంస్కృతిక వారసత్వం కూడా కోల్పోయే ప్రమాదం ఉంది. అందువల్ల చేతివృత్తుల పరిరక్షణను సంస్కృతి సంరక్షణలో భాగంగా చూడాల్సిన అవసరం ఉంది. నేటి యువతలో సంప్రదాయ వృత్తుల పట్ల ఆసక్తి తగ్గిపోవడం మరో ప్రధాన సమస్య. తగిన ఆదాయం లేకపోవడం, సామాజిక గుర్తింపు తగ్గిపోవడం, ఆధునిక ఉద్యోగాల ఆకర్షణ వంటి కారణాలతో యువత ఇతర రంగాల వైపు మొగ్గు చూపుతోంది. దీంతో అనేక కళలు వారసులను కోల్పోతున్నాయి. ఈ పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో కొన్ని చేతివృత్తులు పూర్తిగా అంతరించిపోయే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.


ప్రభుత్వాలు ఈ రంగాల అభివృద్ధికి పలు పథకాలు అమలు చేస్తున్నప్పటికీ వాటి ఫలితాలు ఆశించిన స్థాయిలో కనిపించడం లేదు. రుణ సదుపాయాలు, శిక్షణ కార్యక్రమాలు, మార్కెటింగ్ అవకాశాలు, ప్రదర్శనలు వంటి చర్యలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉంది. చేతివృత్తుల ఉత్పత్తులకు స్థిరమైన మార్కెట్‌ను కల్పించడంతో పాటు ఆధునిక అవసరాలకు అనుగుణంగా కొత్త రూపకల్పనలను ప్రోత్సహించాలి. అప్పుడు మాత్రమే ఈ రంగాలు పోటీలో నిలదొక్కుకోగలవు. డిజిటల్ యుగంలో చేతివృత్తులకు కొత్త అవకాశాలు కూడా అందుబాటులోకి వస్తున్నాయి. అంతర్జాల వేదికల ద్వారా దేశవిదేశాల్లోని వినియోగదారులను చేరుకునే అవకాశం ఉంది. సామాజిక మాధ్యమాలు, వాణిజ్య వేదికలను సమర్థంగా వినియోగించగలిగితే సంప్రదాయ కళలకు కొత్త మార్కెట్లు లభించవచ్చు. ఇందుకు అవసరమైన శిక్షణ, సాంకేతిక సహకారాన్ని ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు అందించాల్సిన అవసరం ఉంది.

ప్రజలు కూడా చేతివృత్తుల పరిరక్షణలో తమ వంతు బాధ్యతను గుర్తించాలి. స్థానిక కళాకారులు తయారుచేసే వస్తువులను కొనుగోలు చేయడం ద్వారా వారికి ఆర్థిక బలం చేకూరుతుంది. పండుగలు, శుభకార్యాలు, గృహావసరాల కోసం స్థానిక ఉత్పత్తులను ప్రాధాన్యంగా ఎంచుకోవడం చేతివృత్తులకు ఊతమిస్తుంది. స్వదేశీ ఉత్పత్తుల వినియోగం పెరిగితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కూడా బలోపేతం అవుతుంది. మరుగున పడుతున్న చేతివృత్తులను కాపాడుకోవడం కాలానుగుణ అవసరంగా మారింది. ఇవి కేవలం కొన్ని కుటుంబాల జీవనాధారం మాత్రమే కాదు, దేశ సాంస్కృతిక సంపదకు జీవం పోసే కళలు. ప్రభుత్వం, సమాజం, వినియోగదారులు, యువత కలిసి కృషి చేసినప్పుడే ఈ వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించగలం. చేతివృత్తులు బతికితేనే గ్రామీణ సంస్కృతి బతుకుతుంది. వాటి పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాల్సిన సమయం ఆసన్నమైంది.

# శ్రావణ సోమవారానికి విశిష్టత

- **శివారాధనకు పవిత్ర సమయం**
- **భక్తులతో కళకళలాడే ఆలయాలు**
- **వ్రతాలు, పూజలతో ఆధ్యాత్మిక వాతావరణం**





**డెస్క్, ఆగస్టు 09 (తెలంగాణ ముచ్చట్లు):** హిందూ సంప్రదాయంలో శ్రావణ మాసానికి అత్యంత విశిష్ట స్థానం ఉంది. ముఖ్యంగా ఈ నెలలో వచ్చే సోమవారాలు శివారాధనకు అత్యంత పవిత్రమైనవిగా భావిస్తారు. శ్రావణ సోమవారం సందర్భంగా దేశవ్యాప్తంగా ఉన్న శివాలయాలు భక్తులతో కిటకిటలాడుతాయి. పరమేశ్వరుడికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, రుద్రపారాయణాలు నిర్వహిస్తూ భక్తులు ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందుతారు. శ్రావణ మాసంలో శివుడిని భక్తిశ్రద్ధలతో పూజిస్తే కోరుకున్న కోరికలు నెరవేరుతాయని విశ్వాసం. పురాణాల ప్రకారం శ్రావణ మాసం దేవాదిదేవుడైన శివునికి అత్యంత ప్రీతికరమైన కాలంగా పేర్కొనబడింది. సముద్ర మథనం సమయంలో వెలువడిన హాలాహల విషాన్ని శివుడు తన కంఠంలో నిలుపుకున్న సందర్భాన్ని స్మరించుకుంటూ ఈ మాసంలో ఆయనకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని పండితులు చెబుతున్నారు. అందువల్ల శ్రావణ సోమవారాల్లో శివలింగానికి జలాభిషేకం, పాలాభిషేకం, బిల్వదళార్చన చేయడం విశేష ఫలితాలను ఇస్తుందని భక్తుల నమ్మకం. శ్రావణ సోమవారం రోజున అనేక మంది ఉపవాస దీక్షలను పాటిస్తారు. ఉదయం స్నానమాచరించి ఆలయాలకు వెళ్లి శివుని దర్శించుకోవడం ఆనవాయితీగా కొనసాగుతోంది. కొందరు రోజు పొడవునా నిరాహార దీక్ష చేపడితే, మరికొందరు పండ్లు లేదా అల్పాహారంతో ఉపవాసాన్ని కొనసాగిస్తారు. భక్తితో చేసిన వ్రతం మనోనిగ్రహాన్ని పెంపొందించడమే కాకుండా ఆధ్యాత్మిక చైతన్యాన్ని కూడా కలిగిస్తుందని పెద్దలు చెబుతుంటారు. దేశంలోని ప్రసిద్ధ శైవక్షేత్రాల్లో శ్రావణ సోమవారం సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేపడతారు. శ్రీశైలం, కాశీ, కేదారనాథ్, సోమనాథ్ వంటి ప్రముఖ దేవాలయాల్లో వేలాది మంది భక్తులు తరలివస్తారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని వేములవాడ, కాళేశ్వరం, శ్రీశైలం, కీసరగుట్ట వంటి ఆలయాలు కూడా భక్తజనంతో నిండిపోతాయి. తెల్లవారుజాము నుంచే క్యూలైన్లలో నిలబడి శివుని దర్శించుకోవడం భక్తుల ఆచారంగా మారింది. శ్రావణ మాసం కేవలం పూజలకు మాత్రమే పరిమితం కాదు. కుటుంబ సభ్యుల మధ్య ఆధ్యాత్మిక భావనలను పెంపొందించే సమయంగా కూడా భావిస్తారు. ఇళ్లలో శివపూజలు నిర్వహించడం, శివపురాణం, రుద్రం, మహామృత్యుంజయ మంత్రాల పారాయణం చేయడం అనేక ప్రాంతాల్లో కనిపించే సంప్రదాయం. పిల్లలకు ధార్మిక విలువలను తెలియజేసే అవకాశంగా కూడా ఈ కాలాన్ని వినియోగించుకుంటారు. మహిళలు శ్రావణ సోమవారాలను ప్రత్యేక భక్తితో ఆచరిస్తారు. కుటుంబ సౌఖ్యం, భర్త ఆయురారోగ్యాలు, సంతాన శ్రేయస్సు కోసం శివపార్వతులను ప్రార్థిస్తారు. అవివాహిత యువతులు మంచి వరుడు లభించాలని శ్రద్ధగా వ్రతాలు నిర్వహిస్తారు. ఈ విశ్వాసాలు తరతరాలుగా కొనసాగుతూ భారతీయ కుటుంబ వ్యవస్థలో భాగంగా మారాయి. శ్రావణ మాసంలో ప్రకృతి కూడా ప్రత్యేక అందాలను సంతరించుకుంటుంది. వర్షాకాలం కారణంగా చెట్లు, మొక్కలు పచ్చదనంతో కళకళలాడుతాయి. ప్రకృతి సోయగాల మధ్య ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరగడం భక్తులకు మరింత ప్రశాంతతను అందిస్తుంది. ప్రకృతి, భక్తి, సంస్కృతి ఒకే వేదికపై కలిసే అరుదైన కాలంగా శ్రావణాన్ని వర్ణిస్తారు. ఆధునిక జీవనశైలిలో ఒత్తిడులు పెరుగుతున్న నేపథ్యంలో శ్రావణ సోమవారాలు మానసిక ప్రశాంతతకు మార్గం చూపుతున్నాయి. ఆలయ దర్శనాలు, మంత్రపఠనం, ధ్యానం వంటి కార్యక్రమాలు మనస్సుకు ప్రశాంతతను అందిస్తాయి. కొంతసేపు అయినా ఆధ్యాత్మిక చింతనలో గడపడం ద్వారా జీవితంలో సానుకూల మార్పులు వస్తాయని అనేక మంది విశ్వసిస్తున్నారు. సామాజికంగా కూడా శ్రావణ సోమవారాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. ఆలయాల వద్ద అన్నదానాలు, సేవా కార్యక్రమాలు, భక్తి గీతాల కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. సమాజంలో ఐక్యత, పరస్పర సహకారం, సేవాభావాన్ని పెంపొందించడంలో ఇవి దోహదపడుతున్నాయి. ధర్మం అనేది కేవలం పూజలకే పరిమితం కాదని, సేవ కూడా అందులో భాగమేనని ఈ కార్యక్రమాలు తెలియజేస్తున్నాయి. శ్రావణ సోమవారం భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తోంది. భక్తి, నియమం, విశ్వాసం, సేవాభావం వంటి విలువలను గుర్తు చేసే ఈ పవిత్ర దినం లక్షలాది మంది జీవితాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించింది. కాలం మారినా శివారాధన పట్ల ప్రజల్లో ఉన్న భక్తి ఏమాత్రం తగ్గకపోవడం భారతీయ సంస్కృతి గొప్పతనాన్ని చాటుతోంది. శ్రావణ సోమవారాలు భక్తులను ఆధ్యాత్మిక మార్గంలో నడిపిస్తూ జీవితానికి కొత్త ఉత్సాహాన్ని అందిస్తున్నాయి.

# బయోడీజిల్‌తో హరిత భవిష్యత్తు

- **ప్రత్యామ్నాయ ఇంధనాల అవసరం**
- **పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు**
- **రైతులకు కొత్త అవకాశాలు**
- **స్థిరమైన అభివృద్ధికి మార్గం**




**డెస్క్, ఆగస్టు 09 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం ఆగస్టు 10న అంతర్జాతీయ బయోడీజిల్ దినోత్సవాన్ని నిర్వహిస్తారు. సంప్రదాయ శిలాజ ఇంధనాలకు ప్రత్యామ్నాయంగా పర్యావరణహిత ఇంధనాల వినియోగాన్ని ప్రోత్సహించడం ఈ దినోత్సవం ప్రధాన లక్ష్యం. పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పులు, ఇంధన వనరుల క్షీణత వంటి సమస్యల నేపథ్యంలో బయోడీజిల్ ప్రాధాన్యం రోజురోజుకూ పెరుగుతోంది. భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించడంలో ఈ ప్రత్యామ్నాయ ఇంధనాలు కీలక పాత్ర పోషిస్తాయని నిపుణులు పేర్కొంటున్నారు. బయోడీజిల్ అనేది మొక్కల నూనెలు, వాడిన వంట నూనెలు, జంతు కొవ్వులు వంటి సహజ వనరుల నుంచి తయారయ్యే ఇంధనం. ఇది సాధారణ డీజిల్‌కు ప్రత్యామ్నాయంగా ఉపయోగించవచ్చు. బయోడీజిల్ వినియోగం వల్ల వాతావరణంలోకి విడుదలయ్యే హానికర వాయువుల పరిమాణం తగ్గుతుంది. అందువల్ల గాలి కాలుష్య నియంత్రణలో ఇది సమర్థవంతమైన పరిష్కారంగా గుర్తింపు పొందుతోంది. అనేక దేశాలు ఇప్పటికే బయోడీజిల్ వినియోగాన్ని ప్రోత్సహించే విధానాలను అమలు చేస్తున్నాయి.

ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఇంధన అవసరాలు దేశాల ఆర్థిక వ్యవస్థలపై భారంగా మారుతున్నాయి. ముఖ్యంగా చమురు దిగుమతులపై ఆధారపడే దేశాలు భారీ విదేశీ మారకద్రవ్యాన్ని వెచ్చించాల్సి వస్తోంది. ఈ పరిస్థితుల్లో దేశీయంగా ఉత్పత్తి చేయగలిగే బయోడీజిల్ వంటి ప్రత్యామ్నాయ ఇంధనాలు ఆర్థిక పరంగా కూడా ప్రయోజనకరంగా మారుతున్నాయి. దిగుమతులపై ఆధారాన్ని తగ్గించడంతో పాటు ఇంధన భద్రతను పెంచడంలో బయోడీజిల్ ఉపయోగపడుతోంది. వాతావరణ మార్పులు ప్రపంచ దేశాలకు ప్రధాన సవాలుగా మారాయి. కార్బన్ ఉద్గారాల పెరుగుదల వల్ల భూతాపం తీవ్రరూపం దాల్చుతోంది. వరదలు, కరువులు, తుపానులు, ఉష్ణోగ్రతల పెరుగుదల వంటి పరిణామాలు తరచూ కనిపిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో తక్కువ కాలుష్యాన్ని విడుదల చేసే బయోడీజిల్ వినియోగం పర్యావరణ పరిరక్షణకు కీలకంగా మారింది. పునరుత్పాదక వనరుల నుంచి తయారయ్యే ఈ ఇంధనం హరిత గృహ వాయువుల ఉద్గారాలను తగ్గించడంలో సహాయపడుతోంది. భారతదేశంలో కూడా బయోడీజిల్ ఉత్పత్తి, వినియోగానికి ప్రాధాన్యం పెరుగుతోంది. కేంద్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఇంధనాల ప్రోత్సాహానికి పలు కార్యక్రమాలను అమలు చేస్తోంది. వాడిన వంట నూనెల సేకరణ, బయోడీజిల్ తయారీ కేంద్రాల ఏర్పాటు, పరిశోధనలకు ప్రోత్సాహం వంటి చర్యలు చేపడుతోంది. భవిష్యత్తులో రవాణా రంగంలో బయోడీజిల్ వినియోగం మరింత విస్తరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. బయోడీజిల్ రంగం రైతులకు కూడా కొత్త అవకాశాలను అందిస్తోంది. బయోడీజిల్ తయారికి ఉపయోగపడే మొక్కల సాగు ద్వారా అదనపు ఆదాయం పొందే అవకాశం ఉంది. పంటల వైవిధ్యీకరణకు ఇది దోహదపడుతుంది. వ్యవసాయ ఆధారిత గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపునివ్వడంలో బయోడీజిల్ పరిశ్రమ ఉపయోగకరంగా మారవచ్చు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కూడా పెరిగే అవకాశం ఉంది. పట్టణ ప్రాంతాల్లో పెరుగుతున్న వాహనాల సంఖ్య గాలి కాలుష్యాన్ని తీవ్రతరం చేస్తోంది. డీజిల్, పెట్రోల్ ఆధారిత వాహనాల నుంచి వెలువడే పొగ ఆరోగ్య సమస్యలకు కారణమవుతోంది. శ్వాసకోశ వ్యాధులు, గుండె సంబంధిత సమస్యలు పెరుగుతున్నాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో బయోడీజిల్ వినియోగం కాలుష్య నియంత్రణకు కొంత మేర ఉపశమనం కలిగించగలదని భావిస్తున్నారు. అయితే బయోడీజిల్ రంగం ఎదుగుదలకు కొన్ని సవాళ్లు కూడా ఉన్నాయి. ఉత్పత్తి వ్యయాలు, ముడి పదార్థాల లభ్యత, నిల్వ సదుపాయాలు, సాంకేతిక పరిజ్ఞానం వంటి అంశాల్లో మరింత పురోగతి అవసరం. పరిశోధనలు, పెట్టుబడులు పెరిగితే బయోడీజిల్ ఉత్పత్తి సామర్థ్యం మరింత మెరుగుపడే అవకాశం ఉంది. ప్రభుత్వాలు, పరిశ్రమలు, శాస్త్రవేత్తలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉంది.

ప్రపంచవ్యాప్తంగా హరిత ఇంధనాల వైపు అడుగులు వేస్తున్న ఈ సమయంలో ప్రజల్లో అవగాహన పెంపొందించడం కూడా ఎంతో ముఖ్యం. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరి పాత్ర ఉందనే భావన బలపడాలి. ప్రత్యామ్నాయ ఇంధనాల వినియోగానికి ప్రజలు సహకరిస్తే స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల సాధన సులభమవుతుంది. భవిష్యత్తు తరాలకు పరిశుభ్రమైన భూమిని అందించడంలో ఇది కీలక అడుగుగా నిలుస్తుంది. అంతర్జాతీయ బయోడీజిల్ దినోత్సవం కేవలం ఒక ప్రత్యేక దినం మాత్రమే కాదు. ఇంధన రంగంలో మార్పు అవసరాన్ని గుర్తుచేసే సందర్భం. ప్రకృతి వనరులను సంరక్షిస్తూ అభివృద్ధిని కొనసాగించాలంటే పర్యావరణహిత ఇంధనాల వినియోగం తప్పనిసరి. బయోడీజిల్ వంటి ప్రత్యామ్నాయ ఇంధనాలు ఆర్థికాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, ఇంధన భద్రత అనే మూడు ముఖ్య లక్ష్యాలను ఒకేసారి సాధించగల సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. అందుకే హరిత భవిష్యత్తు కోసం బయోడీజిల్ వినియోగాన్ని మరింత విస్తరించాల్సిన అవసరం ఉంది.

# అద్దె ఇంటి ముందు సీసీ కెమెరా పెట్టొచ్చా?



**న్యూఢిల్లీ ఆగస్టు 9 (తెలంగాణ ముచ్చట్లు):** నగరాలు, పట్టణాల్లో అద్దె ఇళ్లలో నివసించే వారికి యజమానులతో తరచూ పలు విషయాల్లో వివాదాలు తలెత్తుతుంటాయి. అద్దె చెల్లింపు, సెక్యూరిటీ డిపాజిట్ వంటి అంశాలతో పాటు ప్రస్తుతం సీసీ కెమెరాల ఏర్పాటు కూడా చర్చకు వస్తోంది. భద్రత పేరుతో ఇంటి ముఖద్వారం లేదా అద్దెదారుడి నివాసాన్ని నేరుగా చిత్రీకరించేలా యజమాని కెమెరాలు ఏర్పాటు చేయవచ్చా? అనే సందేహం చాలామందిలో ఉంది.

భద్రత కోసం ఏర్పాటు చేసుకోవచ్చు

యజమాని తన ఆస్తి భద్రత కోసం ప్రవేశ ద్వారాలు, పార్కింగ్ ప్రాంతాలు, మెట్లు, కారిడార్లు వంటి ఉమ్మడి ప్రదేశాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవచ్చు. అయితే కెమెరాల ఏర్పాటు భద్రతా అవసరాలకు అనుగుణంగా ఉండాలి. అద్దెదారుడి వ్యక్తిగత జీవితం, గోప్యతకు భంగం కలిగించే విధంగా కెమెరాలను అమర్చకూడదు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 వ్యక్తిగత స్వేచ్ఛ, గోప్యతకు రక్షణ కల్పిస్తుంది. అందువల్ల ఆస్తి తనదే అన్న కారణంతో యజమాని అద్దెదారుడి వ్యక్తిగత కార్యకలాపాలను నేరుగా పర్యవేక్షించే విధంగా కెమెరాలు ఏర్పాటు చేయడం సమంజసం కాదు. 1882 ఆస్తి బదిలీ చట్టంలోని సెక్షన్ 108 కింద అద్దెదారుడికి కొన్ని హక్కులు ఉంటాయి. అద్దె ఒప్పందానికి అనుగుణంగా ఆస్తిని శాంతియుతంగా వినియోగించే హక్కు అందులో ముఖ్యమైనది. కాబట్టి భద్రత పేరుతో అద్దెదారుడి గోప్యతను ఉల్లంఘించే చర్యలకు యజమాని పాల్పడకూడదు. అదేవిధంగా, సమాచార సాంకేతిక చట్టం, 2000లోని సెక్షన్ 66ఈ వ్యక్తిగత గోప్యతకు సంబంధించిన కొన్ని ఉల్లంఘనలను నేరంగా పరిగణిస్తుంది. అనుమతి లేకుండా వ్యక్తిగత ప్రాంతాల్లో చిత్రీకరణ చేయడం పరిస్థితులను బట్టి చట్టపరమైన సమస్యలకు దారితీయవచ్చు.

అద్దె ఇంటి బయట, ప్రధాన ద్వారం, అపార్ట్‌మెంట్ ప్రవేశ మార్గం వంటి ఉమ్మడి ప్రదేశాల్లో భద్రత కోసం కెమెరా ఏర్పాటు చేయడం సాధారణంగా వేరు. అదే కెమెరా అద్దెదారుడి ఇంటి లోపలి భాగాన్ని లేదా అతడి వ్యక్తిగత కార్యకలాపాలను రికార్డు చేసేలా ఉండటం వేరు. అందువల్ల యజమాని సీసీ కెమెరా ఏర్పాటు చేసేటప్పుడు భద్రతా అవసరం, కెమెరా దిశ, రికార్డింగ్ పరిధి, అద్దెదారుడి గోప్యత వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. గోప్యతకు భంగం కలిగిందని భావిస్తే అద్దెదారుడు సంబంధిత అధికారులను ఆశ్రయించే అవకాశం ఉంటుంది.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక




# కట్ట మైసమ్మ ఆలయంలో కిషన్‌రెడ్డి ప్రత్యేక పూజలు

- **సికింద్రాబాద్‌లో భక్తిశ్రద్ధలతో బోనాల వేడుకలు**
- **అమ్మవారిని దర్శించుకున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**
- **తెలంగాణ ప్రజల ఆరోగ్యం, సుఖసంతోషాల కోసం ప్రత్యేక ప్రార్థనలు**
- **భక్తులతో కలిసి బోనాల వేడుకల్లో పాల్గొన్న కిషన్‌రెడ్డి**

**హైదరాబాద్, ఆగస్టు 9 (తెలంగాణ ముచ్చట్లు):**

సికింద్రాబాద్ పద్మారావునగర్ సమీపంలోని కట్ట మైసమ్మ ఆలయంలో కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాల పర్వదినం సందర్భంగా ఆలయానికి చేరుకున్న ఆయన కట్ట మైసమ్మ అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజల ఆరోగ్యం, సుఖసంతోషాలు, శ్రేయస్సు, సమృద్ధి కోసం అమ్మవారిని ప్రార్థించినట్లు కిషన్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు.

బోనాల పండుగ సందర్భంగా ఆలయానికి తరలివచ్చిన భక్తులతో కలిసి కిషన్‌రెడ్డి వేడుకల్లో పాల్గొన్నారు. అమ్మవారి ఆశీస్సులు తీసుకుని భక్తులతో పండుగ శుభాకాంక్షలు పంచుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రత్యేక ప్రతీకగా నిలుస్తుందని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. ఆషాఢ మాసంలో అమ్మవార్లకు భక్తులు బోనాలు సమర్పిస్తూ తరతరాలుగా వస్తున్న సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు.

కట్ట మైసమ్మ ఆలయంలో బోనాల సందర్భంగా భక్తుల రద్దీ నెలకొంది. అమ్మవారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ పరిసరాల్లో పండుగ వాతావరణం నెలకొంది. తెలంగాణ ప్రజలందరికీ కిషన్‌రెడ్డి బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరికీ ఆరోగ్యం, ఆనందం, సుఖసంతోషాలు, సమృద్ధి కలగాలని ఆకాంక్షించారు.



# కూకట్‌పల్లిలో ఘనంగా బోనాల వేడుకలు

- **అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసిన ఈటల రాజేందర్**
- **మూసాపేట, జేఎన్‌టీయూలో ఆలయాల్లో దర్శనం**
- **తెలంగాణ ప్రజలకు బోనాల శుభాకాంక్షలు**
- **ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్ష**

**హైదరాబాద్, ఆగస్టు 9 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా భావించే ఆషాఢమాస బోనాల వేడుకలు మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని కూకట్‌పల్లి నియోజకవర్గంలో వైభవంగా కొనసాగుతున్నాయి. పండుగ సందర్భంగా బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ మూసాపేటలోని శ్రీశ్రీ చిత్రారమ్మ తల్లి ఆలయంతో పాటు జేఎన్‌టీయూ వద్ద ఉన్న అమ్మవారి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవార్లను దర్శించుకున్న ఈటల రాజేందర్ తెలంగాణ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, పాడిపంటలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో ప్రజలందరికీ శాంతి, సౌభాగ్యం కలగాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రత్యేక గుర్తింపును కలిగి ఉందని ఈటల రాజేందర్ పేర్కొన్నారు. ఆషాఢమాసంలో అమ్మవార్లకు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించడం తరతరాలుగా కొనసాగుతున్న సంప్రదాయమని తెలిపారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో బోనాల వేడుకలు ఆధ్యాత్మిక వాతావరణంలో జరుగుతున్నాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అమ్మవారి దర్శనాల కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. పండుగ నేపథ్యంలో ఆలయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

తెలంగాణ ప్రజలందరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపిన ఈటల రాజేందర్, అమ్మవారి ఆశీస్సులతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రజల ఆరోగ్యం, సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వర్‌రావుతో పాటు స్థానిక సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. భక్తులు సంప్రదాయబద్ధంగా అమ్మవార్లకు బోనాలు సమర్పిస్తూ పండుగను ఘనంగా నిర్వహించారు.



# కేసీఆర్‌కు అడుగడుగునా ఘన స్వాగతం

- **నర్సంపేటకు వెళ్తున్న బీఆర్ఎస్ అధినేత**
- **దారి పొడవునా నాయకులు, కార్యకర్తల అభివాదం**
- **'జై తెలంగాణ.. జై కేసీఆర్' నినాదాలతో హోరెత్తిన కూడళ్లు**
- **పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబానికి పరామర్శ**

**వరంగల్, ఆగస్టు 9 (తెలంగాణ ముచ్చట్లు):**



బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ఆదివారం వరంగల్ జిల్లా పర్యటనలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల నుంచి ఘన స్వాగతం లభించింది. తెలంగాణ ఉద్యమ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే దివంగత పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించేందుకు కేసీఆర్ నర్సంపేటకు రోడ్డు మార్గంలో బయలుదేరారు. కేసీఆర్ ప్రయాణిస్తున్న మార్గంలో పలు గ్రామాలు, పట్టణాల కూడళ్ల వద్ద బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో గుమిగూడారు. తమ అభిమాన నాయకుడి రాక కోసం రహదారుల వెంట వేచి ఉన్నారు. పలు ప్రాంతాల్లో కేసీఆర్‌కు అభివాదం చేస్తూ పార్టీ శ్రేణులు నినాదాలు చేశారు. 'జై తెలంగాణ.. జై కేసీఆర్' అంటూ నినాదాలతో రహదారులు మార్మోగాయి. కేసీఆర్‌కు స్వాగతం పలికేందుకు స్థానిక నాయకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పనిచేసిన పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించేందుకు కేసీఆర్ నర్సంపేటకు వెళ్తున్నారు. సుదర్శన్‌రెడ్డి కుటుంబ సభ్యులను కలిసి వారి యోగక్షేమాలను తెలుసుకోనున్నారు. కేసీఆర్ పర్యటన నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం కనిపించింది. గ్రామాలు, పట్టణాల ప్రధాన కూడళ్ల వద్ద అభిమానులు పెద్ద సంఖ్యలో చేరడంతో రహదారుల వెంట సందడి నెలకొంది. కాగా కేసీఆర్ నర్సంపేట పర్యటనకు సంబంధించిన సమాచారంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి తమ అభిమానాన్ని చాటుకున్నారు. కేసీఆర్‌కు స్వాగతం పలికేందుకు మార్గమధ్యంలోని పలు ప్రాంతాల్లో ఎదురుచూస్తూ నినాదాలు చేశారు.

# బోనాల వేడుకల్లో జూపల్లి

- **అమ్మవారికి ప్రత్యేక పూజలు**
- **పట్టువస్త్రాల సమర్పణ**
- **ఆలయానికి రూ.20 లక్షల మంజూరు**
- **తెలంగాణ సంస్కృతికి బోనాలు ప్రతీక**

**హైదరాబాద్, ఆగస్టు 9 (తెలంగాణ ముచ్చట్లు):**



ఆషాఢమాస బోనాల ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు హైదరాబాద్‌లోని రామభక్త బండ బంగారు మైసమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి రాష్ట్ర ప్రజల సుఖశాంతులు, ఆయురారోగ్యాల కోసం ప్రార్థనలు చేశారు. బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే మహోత్సవమని మంత్రి పేర్కొన్నారు. ఈ పండుగ ద్వారా తెలంగాణ ఆచార వ్యవహారాలు, సాంస్కృతిక వారసత్వం భావితరాలకు చేరుతున్నాయని అన్నారు. భక్తిశ్రద్ధలతో జరిగే బోనాల వేడుకలు ప్రజల్లో ఐక్యతను పెంపొందిస్తాయని తెలిపారు.


రామభక్త బండ బంగారు మైసమ్మ ఆలయం ప్రాంతీయ ప్రజల విశ్వాసానికి కేంద్రబిందువుగా నిలుస్తోందని జూపల్లి అన్నారు. ప్రతి ఏడాది వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు వస్తున్న నేపథ్యంలో ఆలయ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు అవసరమని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కోసం రూ.20 లక్షల నిధులను మంజూరు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. ఈ నిధులతో భక్తులకు అవసరమైన సౌకర్యాల విస్తరణ, ఆలయ పరిసరాల అభివృద్ధి, మౌలిక వసతుల మెరుగుదల చేపట్టనున్నట్లు తెలిపారు.

ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు అందించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని మంత్రి వివరించారు. ఆలయాల పరిరక్షణతో పాటు సంప్రదాయ పండుగల నిర్వహణకు ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. బోనాల ఉత్సవాలు తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తాయని జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. సంప్రదాయాలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని చెబుతూ, ప్రజలందరికీ బోనాల శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఏడు నెలల తర్వాత హత్య కేసులో నిందితుడి అరెస్ట్

- **కెనడాలో భారతీయ సంతతి యువతి దారుణ హత్య**
- **ప్రియుడే హత్య చేసినట్లు పోలీసుల నిర్ధారణ**
- **విదేశాల నుంచి నిందితుడిని కెనడాకు రప్పించిన అధికారులు**
- **టొరంటో విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్న పోలీసులు**

**టొరంటో, ఆగస్టు 9 (తెలంగాణ ముచ్చట్లు):**



కెనడాలో భారతీయ సంతతికి చెందిన 30 ఏళ్ల యువతి హిమాన్షు ఖురానా హత్య కేసులో ఏడు నెలల తర్వాత నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. గత ఏడాది డిసెంబర్ 19న టొరంటోలోని వెల్లింగ్టన్ స్ట్రీట్ వెస్ట్, స్ట్రాచన్ అవెన్యూ ప్రాంతంలో హిమాన్షు హత్యకు గురయ్యారు. మరుసటి రోజు పోలీసులకు సమాచారం అందడంతో ఘటనా స్థలానికి చేరుకున్న అధికారులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. మొదట ఈ ఘటనను అనుమానాస్పద మృతిగా పరిగణించిన పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేపట్టారు. అనంతరం ఇది హత్యగా నిర్ధారణైంది. హిమాన్షు మృతికి సంబంధించి ఆమెకు పరిచయస్తులు, సమీప వ్యక్తులు, ఆమె వ్యక్తిగత సంబంధాలపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేశారు. ఈ కేసు ఆ సమయంలో టొరంటోలో నమోదైన 40వ హత్యగా పోలీసులు గుర్తించారు.

దర్యాప్తులో హిమాన్షుతో కొంతకాలంగా సంబంధంలో ఉన్న అబ్దుల్ గఫూరి అనే 32 ఏళ్ల వ్యక్తిపై పోలీసులకు అనుమానాలు బలపడ్డాయి. అతడే హిమాన్షును హత్య చేసినట్లు ఆధారాలు లభించడంతో నిందితుడిగా గుర్తించారు. ఇద్దరి మధ్య విభేదాలు హత్యకు కారణమై ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే హత్యకు అసలు కారణం దర్యాప్తు పూర్తయిన తర్వాతే స్పష్టమవుతుందని అధికారులు తెలిపారు. హత్య అనంతరం అబ్దుల్ గఫూరి పరారయ్యాడు. అతడిని పట్టుకునేందుకు పోలీసులు జాతీయ స్థాయిలో అరెస్టు వారెంట్ జారీ చేశారు. అతడి ఫొటోలు, వివరాలను బహిరంగంగా విడుదల చేసి ప్రజలకు సమాచారం అందించారు. నిందితుడి ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం అందించాలని అధికారులు కోరారు.

దర్యాప్తులో భాగంగా నిందితుడు కెనడా వెలుపలికి వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. దీంతో అంతర్జాతీయ సంస్థల సహకారంతో అతడి ఆచూకీ కోసం ప్రయత్నాలు కొనసాగించారు. అనంతరం అతడిని కెనడాకు రప్పించడంలో అధికారులు విజయం సాధించారు. టొరంటో విమానాశ్రయానికి చేరుకున్న వెంటనే పోలీసులు అబ్దుల్ గఫూరిని అదుపులోకి తీసుకున్నారు. అయితే అతడు ఏ దేశంలో ఉన్నాడనే వివరాలను పోలీసులు వెల్లడించలేదు. అబ్దుల్ గఫూరిపై ఫస్ట్ డిగ్రీ హత్య కేసు నమోదు చేసినట్లు టొరంటో పోలీసులు తెలిపారు. హిమాన్షు హత్య జరిగిన ఏడు నెలల అనంతరం నిందితుడు అరెస్టు కావడంతో కేసు దర్యాప్తులో కీలక ముందడుగు పడింది. హత్యకు దారితీసిన కారణాలు, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకునేందుకు విచారణ కొనసాగుతోందని, దర్యాప్తు ఆధారంగా తదుపరి న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు వెల్లడించారు.

# డీమార్ట్‌లో షాపింగ్‌కు ఇదే బెస్ట్ టైమ్!

**హైదరాబాద్ ఆగస్టు 9 (తెలంగాణ ముచ్చట్లు):**




నిత్యావసర సరుకులు, ఇంటి అవసరాలకు సంబంధించిన వస్తువులు కొనుగోలు చేయాలంటే చాలామంది ముందుగా డీమార్ట్ వైపే చూస్తుంటారు. తక్కువ ధరలు, డిస్కౌంట్లు, వివిధ ఆఫర్ల కారణంగా సామాన్య, మధ్యతరగతి ప్రజల్లో దీనికి మంచి ఆదరణ ఉంది. ముఖ్యంగా శని, ఆదివారాలు, సెలవు రోజుల్లో డీమార్ట్ స్టోర్లు భారీ రద్దీతో కనిపిస్తుంటాయి.

**సోమవారం ఆఫర్లకు అవకాశం**

ఆదివారం సాధారణంగా ఎక్కువ మంది షాపింగ్‌కు వస్తుండటంతో విక్రయాలు అధికంగా ఉంటాయి. దీంతో సోమవారం కొన్ని అదనపు ఆఫర్లు లేదా డిస్కౌంట్లు లభించే అవకాశం ఉందని వినియోగదారుల అనుభవాలు చెబుతున్నాయి. అయితే ఆఫర్లు అన్ని స్టోర్లలో ఒకే విధంగా ఉండవు. ప్రాంతం, రాష్ట్రం, స్టోర్ ఆధారంగా ధరలు, ఆఫర్లు మారే అవకాశం ఉంటుంది.

షాపింగ్‌కు వెళ్లే ముందు డీమార్ట్ రెడీ యాప్‌లో ధరలు, అందుబాటులో ఉన్న ఆఫర్లను పరిశీలించడం ఉపయోగకరంగా ఉంటుంది. కొన్ని సందర్భాల్లో స్టోర్ కంటే యాప్‌లోనే ప్రత్యేక ధరలు, కూపన్లు లేదా అదనపు డిస్కౌంట్లు కనిపించే అవకాశం ఉంటుంది.

**రద్దీ తక్కువగా ఉండే రోజులు**

వీకెండ్ సమయంలో డీమార్ట్ స్టోర్లలో భారీగా రద్దీ ఉంటుంది. ముఖ్యంగా శుక్రవారం నుంచి ఆదివారం వరకు వినియోగదారుల సంఖ్య ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ప్రశాంతంగా షాపింగ్ చేయాలనుకునేవారు సాధారణంగా సోమవారం నుంచి గురువారం మధ్య వెళ్లడం మంచిది.

అలాగే ఉదయం స్టోర్ తెరిచిన వెంటనే వెళ్లినా రద్దీ తక్కువగా ఉండే అవకాశం ఉంటుంది. మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల మధ్య కూడా కొన్ని స్టోర్లలో కస్టమర్ల సంఖ్య తక్కువగా ఉండవచ్చు. సాయంత్రం వేళల్లో మాత్రం ఉద్యోగాలు, ఇతర పనులు ముగించుకుని వచ్చే వారి కారణంగా రద్దీ పెరిగే అవకాశం ఉంటుంది.

**నెలలో ఏ సమయంలో వెళ్లాలి?**

ప్రతి నెలా మొదటి వారంలో జీతాలు అందుకున్న తర్వాత షాపింగ్ చేసే వారి సంఖ్య పెరగవచ్చు. దీంతో ఆ సమయంలో స్టోర్లలో రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. నెల 10వ తేదీ నుంచి 25వ తేదీ మధ్య సాధారణ రోజుల్లో కాస్త తక్కువ రద్దీ కనిపించే అవకాశం ఉందని వినియోగదారుల అనుభవాలు చెబుతున్నాయి.

అయితే ఇవి అన్ని డీమార్ట్ స్టోర్లకు ఖచ్చితంగా వర్తించే నియమాలు కావు. స్థానిక ప్రాంతం, స్టోర్ పరిమాణం, పండుగలు, సెలవులు, ప్రత్యేక విక్రయాలు వంటి అంశాల ఆధారంగా రద్దీ మారవచ్చు.

**షాపింగ్‌కు ముందు ఈ పని చేయండి**

డీమార్ట్‌కు వెళ్లే ముందు యాప్‌లో ధరలను ఒకసారి పరిశీలించడం, అవసరమైన వస్తువుల జాబితాను సిద్ధం చేసుకోవడం, రద్దీ తక్కువగా ఉండే సమయాన్ని ఎంచుకోవడం ద్వారా సమయం, డబ్బు రెండింటినీ ఆదా చేసుకోవచ్చు. ముఖ్యంగా ఆఫర్ ఉందని అవసరం లేని వస్తువులు కొనుగోలు చేయకుండా, ధరలను పోల్చి చూసిన తర్వాతే కొనుగోలు చేయడం మంచిది.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# ఆగస్టు 10న నిరసన ర్యాలీ

**గత కొన్ని సంవత్సరాలుగా దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని క్రైస్తవ దళితులు ...ముస్లిం దళితులు పోరాడుతున్న విషయం మనందరికీ తెలిసిందే.... 1950 రాష్ట్రపతి ఆర్డర్ లో ముందు కేవలం హిందూ దళితులకు మాత్రమే ఎస్సి హోదా వర్తిస్తుందని చెప్పారు... ఆ తర్వాత 1950 రాష్ట్రపతి ఉత్తర్వులకు సవరణల ద్వారా 1956 లో సిక్కు మత దళితులకు అదేవిధంగా 1996లో బౌద్ధమత దళితులకు ఎస్సీ హోదా వర్తిస్తుందని సవరణలు చేశారు..... కానీ దళిత క్రైస్తవులకు మాత్రం ఎస్సి హోదా అనేది అందని ద్రాక్షగా మారింది....**

అయితే గత కొన్ని సంవత్సరాలుగా దళిత క్రైస్తవులకు జరుగుతున్న అన్యాయానికి ఇటీవల పాస్టర్ చింతాడ ఆనంద్ కేసులో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు మరింత ఆజ్యం పోసినట్టు అయింది... సుప్రీంకోర్టు తీర్పు తర్వాత ఈ అంశం సమాజంలోని అన్ని వర్గాలలో తీవ్రమైన చర్చకు దారితీసింది.. సమాజంలోని మేధావులు విశ్లేషకులు విద్యార్థులు అన్ని రంగాల ప్రజలు దళిత క్రైస్తవులకు ఎస్సి హోదా కల్పించాలని డిమాండ్లను సమర్థిస్తున్నాయి... దీనికి కారణం లేకపోలేదు... భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 25 నుండి 30 వరకు దేశ ప్రజలు ఏ మతాన్ని అయినా స్వేచ్ఛగా ఆరాధించే మరియు అనుసరించే హక్కును కల్పించాయి

**ఆర్టికల్ 25 – మనస్సాక్షి స్వేచ్ఛ; మతాన్ని స్వేచ్ఛగా ప్రకటించడం, ఆచరించడం, ప్రచారం చేయడం**

దానికి విరుద్ధంగా గత 76 సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వాలు దళిత క్రైస్తవులకు తీవ్రంగా నష్టం చేశారు..... దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా వర్తించకపోతే వారికి విద్యా ఉద్యోగ రంగాలలో ఎస్సీ రిజర్వేషన్లు వర్తించవు, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం రక్షణగా ఉండదు, ప్రభుత్వ పథకాలు వర్తించవు... స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి భారతదేశంలో మతాలు మారిన దళితుల స్థితిగతులపై అధ్యయనాలు చేయడానికి ఆయా ప్రభుత్వాలు అనేక రకాల కమీషన్లను నియమించాయి.. ఆయా కమిషన్లు కూడా మతం మారినంత మాత్రాన దళితుల స్థితిగతులలో సామాజిక పరిస్థితులలో ఎలాంటి మార్పులు రాలేదని అనేక కమిషన్లు తమ యొక్క నివేదికల్లో వెల్లడించాయి.. 2004లో అప్పటి కేంద్ర ప్రభుత్వం మైనార్టీలలో వెనుకబాటుతనాన్ని అధ్యయనం చేయడానికి "నేషనల్ కమిషన్ ఫర్ రిలీజియస్ అండ్ లింగ్విస్టిక్ మైనారిటీస్" అనే కమిషన్ ని నియమించింది .. దీనినే "రంగనాథ్ మిశ్రా కమిషన్" అని కూడా అంటారు.. రంగనాథ్ మిశ్రా కమిషన్ 2007 లో కేంద్ర ప్రభుత్వానికి తమ యొక్క నివేదికను సమర్పించాయి... కేంద్ర ప్రభుత్వానికి రంగనాథ్ మిశ్రా కమిషన్ తమ నివేదికలో మతం మారినంత మాత్రాన దళితుల సామాజిక పరిస్థితులు ఏమాత్రం మారలేదనీ... క్రైస్తవ్యంలోకి మారిన దళితులకు , ఇస్లాం మతంలోకి మారిన దళితులకు కూడా ఎస్సీ హోదా వర్తింపజేయాలని సిఫారసు చేసింది.. 2007 నుండి కేంద్ర ప్రభుత్వాలు ఆ సిఫారసులను అమలు చేయకుండా నిర్లక్ష్యం చేశాయి.... అయితే 2022లో బిజెపి ప్రభుత్వం కూడా క్రైస్తవ్యంలోకి ఇస్లాం మతం లోకి మారిన దళితులకు ఎస్సీ హోదా ఇవ్వాలా వద్ద అనే అంశంపై అధ్యయనం చేయడానికి జస్టిస్ కే జీ బాలకృష్ణ కమిషన్ ను నియమించింది.... జస్టిస్ కే.జీ బాలకృష్ణన్ కమిషన్ తమ నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించేందుకు సిద్ధమైంది.... ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో జస్టిస్ బాలకృష్ణన్ కమిషన్ నివేదిక పై తీవ్ర ఉత్కంఠ నెలకొంది.. జస్టిస్ బాలకృష్ణ కమిషన్ కు తెలుగు రాష్ట్రాల్లోని అనేక సామాజిక సంఘాలు, రాజకీయ పార్టీలు క్రైస్తవ్యంలోకి ఇస్లాంలోకి మారిన దళితులకు ఎస్సీ హోదా వర్తింపజేయాలని విన్నవించాయి....

దేశంలో ఒక మతం నుంచి ఇంకొక మతంలోకి మారడం సాధారణమైన విషయం... అది ఆయా వ్యక్తుల యొక్క వ్యక్తిగత మనోభావాలకు సంబంధించిన అంశం.. కానీ నిచ్చెన మెట్ల సమాజంలో మతం మారినంత మాత్రాన కులం మారాదు... పుట్టుకతో వచ్చిన కులం చనిపోయేంత వరకు ఉంటుంది.. దళితులు క్రైస్తవ్యం లోకి మారినంత మాత్రాన వారు అగ్రవర్ణాలుగా ఏం మారరు ... వారి సామాజిక స్థితిగతులు యధావిధిగా ఈ నిచ్చెన మెట్ల సమాజంలో కొనసాగుతూనే ఉంటాయి... మొట్టమొదట భారతదేశంలో క్రైస్తవ్యంలోకి మారింది అగ్రవర్ణాలే అనేదానికి అనేక చారిత్రాత్మక ఆధారాలు ఉన్నాయి... క్రైస్తవ్యంలోకి అగ్రవర్ణాలు మారిన బీసీలు మారిన వారి సామాజిక స్థాయిలు మాత్రం ఈ సమాజంలో యధావిధిగా కొనసాగుతున్నాయి... వారికి ప్రభుత్వం నుంచి వారి కులం ఆధారంగా వచ్చే ప్రభుత్వ పథకాలు యధావిధిగా వర్తిస్తున్నాయి.. మతం మారితే అగ్రవర్ణాలకు, బీసీలకు లేని ఆంక్షలు కేవలం దళితులకు మాత్రమే ఎందుకు ??? దళితులలో కూడా సిక్కుమత దళితులకు బౌద్ధ మత దళితులకు ఎస్సీ హోదా కు అంగీకరించిన కేంద్ర ప్రభుత్వాలు క్రైస్తవ మరియు ఇస్లాం మత దళితులకు మాత్రమే ఎందుకు ఆంక్షలు పెడుతున్నాయో అర్థం కాని అంశం ....???

అయితే భారత రాజ్యాంగం ఈ దేశంలో ఏ మతాన్ని అయిన స్వేచ్ఛగా ఆరాధించుకునే హక్కును దేశ పౌరులకు కల్పించింది.... కానీ 1950 (ఆగస్టు 10) రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం తమకు అన్యాయం జరిగిందని ఇస్లాంలోకి మారిన దళితులు క్రైస్తవ్యంలోకి మారిన దళితులు ఆగస్టు 10 తేదీన నిరసన దినంగా పాటిస్తారు.. తమ యొక్క ఆవేదనను ఆకాంక్షలను వివిధ నిరసన రూపాలలో ప్రభుత్వాలకు తెలియజేస్తూ ఉంటారు... గత సంవత్సరాలలో జరిగిన నిరసనలు ఒక ఎత్తు అయితే ఈ సంవత్సరం జరిగే నిరసనలు ఒక స్థాయిలో నిలిచిపోతాయి దానికి కారణం లేకపోలేదు.. ఈ సమస్యపై అనేక సామాజిక సంఘాలు రాజకీయ పార్టీలు సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో స్పందించాయి.. వారి పోరాటం విజయవంతమై క్రైస్తవ్యంలోకి ఇస్లాంలోకి మారిన దళితులకు ఎస్సీ హోదా వర్తించేలా కేంద్ర ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకుంటాయని ఆకాంక్షిద్దాం.



**అనంతపురం కమలేష్**
**రచయిత**
**సామాజిక విశ్లేషకులు**



# రుద్రగా మహేశ్!

## రాజమౌళి 'వారణాసి' నుంచి క్రేజీ అప్‌డేట్..

మహేశ్ బాబు- రాజమౌళి కాంబోలో వస్తోన్న మోస్ట్ అడ్వెంచరస్ మూవీ వారణాసి. ఇప్పటికే ఈ మూవీపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్‌తో బిజీగా ఉన్నారు రాజమౌళి. ఈ మూవీ వచ్చే ఏప్రిల్ 7న ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది.

తాజాగా ఈ మూవీకి సంబంధించిన క్రేజీ అప్‌డేట్ వచ్చేసింది. ప్రిన్స్ మహేశ్ బాబు పుట్టినరోజు సందర్భంగా ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. ఈ మూవీలో రుద్రను పరిచయం చేస్తూ పోస్టర్ విడుదల చేశారు. రౌద్రం ఒక్కటే అతడి స్వభావం కాదు అనే క్యాప్షన్ పెట్టారు. కాగా.. ఈ చిత్రంలో మహేశ్ బాబు.. రుద్ర, శ్రీరాముడిగా ద్విపాత్రాభినయం చేస్తున్నారు.

తాజాగా రిలీజైన ఫస్ట్ లుక్ పోస్టర్‌లో మహేశ్ బాబు చాలా సింపుల్‌గా కనిపించారు. పొడవైడ జుట్టు, గడ్డంతో రిలీజ్ చేసిన మహేశ్ బాబు పోస్టర్ అభిమానులను ఆకట్టుకుంటోంది. ఇది చూస్తుంటే రుద్ర పాత్ర ప్రపంచ యాత్రికుడిగా ఉండనుందని అర్థమవుతోంది. కాగా.. ఈ చిత్రంలో బాలీవుడ్ భామ ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా కనిపించనుంది. మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో నటిస్తున్నారు.





# 104 డిగ్రీల జ్వరంలోనూ షూటింగ్‌కు అవికా గోర్..

## అంకితభావానికి నిదర్శనం

'చిన్నారి పెళ్లికూతురు' సీరియల్‌తో తెలుగు ప్రేక్షకులకు ఎంతో దగ్గరైన నటి అవికా గోర్. బాలనటిగా బుల్లితెరపై ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆమె.. ఆ తర్వాత కథానాయికగా వెండితెరపైనా తన అదృష్టాన్ని పరీక్షించుకుంటూ వస్తున్నారు. ఆశించిన స్థాయిలో కెరీర్ పుంజుకోకపోయినా, వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ నటిగా కొనసాగుతున్నారు.

104 డిగ్రీల జ్వరంతోనూ షూటింగ్‌కు..

అవికా గోర్ వృత్తిపట్ల ఎంతటి అంకితభావంతో ఉంటారో తెలియజేసే ఓ ఆసక్తికరమైన విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. ఆమె భర్త, సామాజిక కార్యకర్త మిలింద్ చంద్వాని ఈ విషయాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా వెల్లడించినట్లు తెలుస్తోంది.

ఓ సమయంలో అవికా గోర్‌కు ఏకంగా 104 డిగ్రీల జ్వరం వచ్చిందట. తీవ్రమైన డెంగ్యూ జ్వరంతో బాధపడుతున్నప్పటికీ ఆమె షూటింగ్‌కు హాజరయ్యారని మిలింద్ తెలిపారు. ఆరోగ్యం సహకరించకపోయినా పని కోసం షూటింగ్‌కు వెళ్లడంతో ఆమె అనారోగ్యం మరింత తీవ్రంగా మారిందని పేర్కొన్నారు.

**ఆరోగ్యం కూడా ముఖ్యమే..**

అధిక జ్వరం, డెంగ్యూ వంటి అనారోగ్య పరిస్థితుల్లో తగిన విశ్రాంతి తీసుకోవడం ఎంతో అవసరం. అలాంటి సమయంలోనూ అవికా చూపించిన వృత్తి నిబద్ధత తనను ఆశ్చర్యానికి గురిచేసిందని మిలింద్ పేర్కొన్నట్లు సమాచారం. కెరీర్‌లో ఎన్నో ఒడిదుడుకులు ఎదురైనప్పటికీ నటనపై అవికా గోర్‌కు ఉన్న ఆసక్తి మాత్రం తగ్గలేదు. వచ్చిన ప్రతి అవకాశాన్ని సీరియస్‌గా తీసుకుంటూ ముందుకు సాగుతున్నారు. అయితే ఆరోగ్యాన్ని పణంగా పెట్టి పనిచేయడం కంటే అనారోగ్య సమయంలో తగిన విశ్రాంతి తీసుకోవడం కూడా అంతే ముఖ్యమని అభిమానులు అభిప్రాయపడుతున్నారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in